ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 12 సంచిక : 123 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 8 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :12 ISSUE :123 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 8 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

### తెలంగాణతో నీటి వివాదాలపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు

- కొందరు మాట్లాడుతున్న మాటలు తనకు అర్థం కావడం లేదని వ్యాఖ్య
- రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచొద్దని హితవు
- వైసీపీ అక్రమాలపై దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి
- రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపాటు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీ సీఎం చంద్రబాబు ఈరోజు పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణతో నీటి వివాదాలపై సున్నితంగా, స్పష్టంగా స్పందించారు.గోదావరి నదిలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయని, సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చని చంద్రబాబు అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు అభ్యంతరం చెప్పడం సరికాదని, నీటి విషయంలో రాజకీయాలు చేయొద్దని తెలంగాణను కోరారు. "తెలుగు జాతి ఒక్కటే... ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి.

వివరాలు 2లో..




# పోలవరం పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష...

## నిర్వాసితులపై పూర్తి ఫోకస్ పెట్టాలని ఆదేశం

- మిగిలిన పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశం
- నిర్వాసితుల పునరావాసంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని సూచన
- ఆర్ అండ్ ఆర్ పనులపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్న సీఎం
- మే మొదటి వారంలో మళ్లీ పనులను పరిశీలిస్తానని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై దృష్టి సారించారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సైట్ వద్ద జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టులో మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రాజెక్టులో ఇప్పటికే 87 శాతం సివిల్ పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించుకుని ముందుకు సాగాలని సూచించారు.అదేవిధంగా పోలవరం ఎడమ కాలువ పనులను వేగవంతం చేయాలని సీఎం తెలిపారు. కుడి కాలువ ద్వారా కొల్లేరు ప్రాంతానికి కూడా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కీలక సూచన చేశారు.

ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారధి, నాదెండ్ల మనోహర్, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వచ్చే మే నెల మొదటి వారంలో తాను మళ్లీ పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని స్వయంగా తనిఖీ చేస్తానని చంద్రబాబు వెల్లడించారు.

## కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కేటీఆర్ ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న వైసీపీ అభిమానులు, కార్యకర్తలు
- ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో కేసీఆర్, కేటీఆర్ ఫ్లెక్సీలు



త**పెన్ పవర్ డెస్క్:**ెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెంలో ర్యాలీ నిర్వహించారు.

వివరాలు 2లో..

## చైనాలో మంచు సునామీ...



**పెన్ పవర్ డెస్క్:**గడ్డకట్టిన నది ఉన్నట్టుండి ఉప్పొంగింది.. మంచు కరిగి ప్రవాహాన్ని ముంచెత్తింది. శీతాకాలం కావడంతో పూర్తిగా మంచు పేరుకుపోయిన నదిని చూసేందుకు వచ్చిన పర్యాటకులు భయాందోళనకు గురయ్యారు. చైనాలోని జిన్ జియాంగ్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు దీనిని 'మంచు సునామీ'గా అభివర్ణిస్తూ కామెంట్లు పెడుతున్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసు...
## కోర్టుకు చేరిన ఎఫ్ఎస్ఎల్ కీలక నివేదిక

- నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి డిజిటల్ ఆధారాల సేకరణ
- ఫోరెన్సిక్ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం
- పెద్ద పేర్లు వెలుగులోకి వచ్చే అవకాశం




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను కుదిపేస్తున్న లిక్కర్ స్కామ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నిందితుల మొబైల్ ఫోన్ల నుంచి

వివరాలు 2లో..

## రాయలసీమ కట్టప్ప జగన్ రెడ్డి.. సీమ ద్రోహి

- 102 ప్రాజెక్టులు రద్దు చేసి సీమకు ద్రోహం చేశాడని మండిపాటు
- 2020లో స్టే ఇస్తే కౌంటర్ దాఖలు చేయలేని సీమ ద్రోహి అంటూ ఆగ్రహం
- అప్పర్ భద్రను జగన్ అడ్డుకోలేదని ఆరోపణ

**పెన్ పవర్ డెస్క్:**రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను 102 రద్దు చేసిన జగన్ రెడ్డి రాయలసీమకు కట్టప్పగా మిగిలిపోయారని, రాయలసీమ ద్రోహి జగన్ అని సీడాప్ ఛైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

వివరాలు 2లో..



## కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- వీధి కుక్కల కేసు విచారణలో సుప్రీం కీలక వ్యాఖ్యలు
- కరిచినా, కరవకున్నా కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వ్యాఖ్య
- వీధుల్లో, స్కూల్స్, విద్యా సంస్థల పరిసరాల్లో కుక్కలు ఉండాల్సిన అవసరమేంటని ప్రశ్న



**పెన్ పవర్ డెస్క్:**వీధి కుక్కలు ఎప్పుడు కరుస్తాయనే విషయం ఎవరూ ఊహించలేరని, వాటి మూడ్ ను అర్థం చేసుకోలేరని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధుల్లో సంచరించే కుక్కలు తరచూ వాహనాలకు అడ్డుపడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని గుర్తుచేసింది. ఈ మేరకు

వివరాలు 2లో..

## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో రవి పిటిషన్
- రవికి విదేశీ పౌరసత్వం ఉందని కోర్టుకు తెలిపిన పోలీసులు
- బెయిల్ ఇస్తే విదేశాలకు పరారయ్యే అవకాశం ఉందని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఐబొమ్మ రవికి నాంపల్లి కోర్టులో చుక్కెదురైంది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్ ను విచారించిన కోర్టు.. బెయిల్ ఇచ్చేందుకు నిరాకరిస్తూ పిటిషన్ ను తోసిపుచ్చింది. సినిమా పైరసీ వెబ్ సైట్ 'ఐబొమ్మ' వ్యవహారంలో సైట్ నిర్వాహకుడు ఇమంది రవిని అరెస్టు చేసిన పోలీసులు.. సైబర్ క్రైమ్ చట్టాల కింద ఐదు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం జైలులో

వివరాలు 2లో..








### విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే..
## ఏపీలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు

- 24 గంటల్లో 28.95 లేన్-కిలోమీటర్ల బీటీ రోడ్డు వేసి అరుదైన ఘనత
- ఇది భారత్, ఏపీకి గర్వకారణమని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- ఈ మార్గంతో సగానికి తగ్గనున్న అమరావతి-బెంగళూరు ప్రయాణ సమయం

వివరాలు 2లో..

## రాజాసాబ్ ప్రీమియర్ షో టికెట్.. ఏపీలో వెయ్యి రూపాయలు.. జీవో విడుదల



- సంక్రాంతి సినిమాల నిర్మాతలకు హైకోర్టులో ఊరట
- టికెట్ రేట్ల పెంపుపై నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వానికి ఆదేశం
- 'రాజాసాబ్', 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రాలకు మేలు
- సింగిల్ బెంచ్ తీర్పు ఈ చిత్రాలకు వర్తించదని స్పష్టం చేసిన కోర్టు

**పెన్ పవర్ డెస్క్:**మారుతి, ప్రభాస్ కాంబోలో తెరకెక్కిన సినిమా 'ది రాజా సాబ్'. ఈ సినిమా టికెట్ రేట్ల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు జీవో విడుదల చేసింది. రాజాసాబ్ ప్రీమియర్ షో టికెట్ ధరను జీఎస్టీతో కలిపి వెయ్యి రూపాయలకు అమ్ముకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. జనవరి 9న విడుదలవుతున్న 'ది రాజా సాబ్' సినిమాను.. ప్రీమియర్ షోతో

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

### భారతీయ గ్రంథాలు.. కీర్తి సంకేతాలు

అక్షరరూపం దాల్చిన ఒకే ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అని ఆర్యోక్తి అక్షరం ఒక శక్తివంత మైన ఆయుధం. మానవుని భావనా తరంగాలు ఇతరులు స్పష్టంగా చదువ గలిగే ఒక కెమెరా దృశ్యాలు. మనిషి తన ఆలోచనలను గ్రంథ రూపంలోకి తెస్తే, తన తరువాతి కాలంలోనూ చదువగలిగే సాధనం అక్షరం. మనిషి అయు ప్రమాణం వందేళ్ళయితే, గ్రంథ ఆయు ప్రమాణం అనంతం. ఆ కారణంగానే హిందూ ధర్మంలో గ్రంథాన్ని సరస్వతి రూపంగా భావిస్తూ, గ్రంధ పూజను పుస్తకాల (సరస్వతి) పండుగ పేరుతో శరన్నవరాత్రులలో నిర్వ హించే ఆచారం కొనసాగు తున్నది. గ్రంథం పొరపాటున కాలికి తగిలితే, కళ్ళకు అద్దుకునే సత్సంప్రదాయం భారతావనిలో ఉంది. గ్రంధానికి వయసు అనేది లేదు. అపౌరుషేయాలని భావించే వేదాలు మొదలుకుని, 2300 ఏళ్ళ క్రితం కౌటిల్యుడు అర్థశాస్త్రం, అనంతరం పాణిని 'అష్టాధ్యాయి', పతంజలి 'యోగశాస్త్రం', భరతముని 'నాట్య శాస్త్రం', హాలుని 'గాథా సప్తశతి' ఇలా ప్రాచీన గ్రంథాలెన్నో ప్రపంచ సాహిత్యాకాశాన ధ్వజాలలాగ రెపరెప లాడే కీర్తి సంకేతాలుగా నిలుస్తున్నాయి. గ్రంథానికి మృతి లేదు. అక్షర రూపం దిద్దుకున్న ఆలోచన, రాసిన వసువును బట్టి ఎంతకాలం మన గలుగుతుందో నిర్ణయ మవుతుంది. తాళపత్ర, బూర్జ పత్ర, తామ్రపత్ర, చర్మపత్ర రూపాలలో ఉన్నవి శిథిలా లైతే, తిరిగి ప్రతి లేఖనాలవు తాయి. మనిషి అజ్ఞానంతోనో, తెలియకో, విలువ స్వార్థపరుడై విధ్వంసం చేస్తే తప్ప, తామ్ర, శిలా రూపాలకు చావే లేదు కదా. భారతీయ సాహిత్య సంబంధిత అనేకానేక అపురూప గ్రంధాలు విదేశీయులను ఆకర్షించాయి. అలెగ్జాండర్ ప్రపంచ విజేత కావాలనే తలంపులో భాగంగా, భారత దేశాన్ని జయించడానికి వచ్చిన సందర్భంగా ఆయన గురువైన ఆరిస్టాటిల్, మన దేశ తత్వ సాహిత్యాన్ని తిరిగి వచ్చేపుడు తెమ్మన్నాడు. బుద్ధ బోధన గ్రంథాలు, విదేశీ యాత్రికుల సందర్శనలకు హేతువులైనాయి, చైనా, టిబెట్, ఆఫ్ఘనిస్థాన్, మంగోలియా దేశీయులు భారత సందర్శనతో పాటు, ఇక్కడి బౌద్ధ సాహిత్య మూల, అనువాద రూపాలలో తీసు కెళ్ళారు. అక్షరం కనుగొన బడడానికి ముందు వేద వాఙ్మయం శ్రుత సాహిత్యంగా ఉండేది. శ్రాతం లిఖితం కావడం మానవ సంస్కృతీ వికాస పరి ణామ క్రమంలో ముఖ్య ఘట్టం. వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ప్రస్తానత్రయం, భారత భాగవత రామాయణాలు, ఉప పురాణాలు, స్మృతి గ్రంధాలు, భారతీయ కథా సాహిత్యం, గ్రంథ రూపం సంతరించు కున్నాక, ప్రపంచంలో ఏ జాతీ, ఏ దేశం, భారత దేశానికి సాటి రావని, సర్వ ప్రపంచానికి ద్యోతకమైంది. భారతీయ సంస్కృ తిని చాటిచెప్పే గొప్ప మాధ్యమం గ్రంథం. ప్రాచీన తాళపత్ర గ్రంధాలు నలంద, తక్షశిల తది తర విశ్వ విద్యాల యాలలో భద్రపరచ బడి, కొన్ని విదేశీ, విమతాల దాడులలో నశించాయి. మానవుని ఈర్ష్య, అసూయ, కుత్సిత బుద్ధి కారణాలుగా మానవ మేధ చాలాసార్లు మాడి మసి బొగ్గయింది. నేపాల్ విశ్వ విద్యాలయ గ్రంథాలయ భవనం ముందు యాభై వేల సంస్కృత అపురూప గ్రంథాలు తీవ్రవాదుల దాష్టీకానికి బలైన సంఘటన ఈ శతాబ్దపు విశాద ఘటన. ముద్రణా యంత్రాలు వచ్చాక, ప్రతుల ప్రచురణ సులభమైంది. ఒకేసారి ఒక గ్రంథ వందలాది ప్రతులు సిద్ధ మయ్యే సౌలభ్యం ఏర్పడింది. అంతకు ముందు రాజాస్థానాలలో ప్రతులు తయారు చేసే ఉద్యోగులు ఉండే వారు. అయితే మానవ నిర్మిత గ్రంథ తయారీ పని బహు కష్టంతో కూడు కునేది. ముద్రణా యంత్రాల ఆధునీ కరణ జరిగింది. మరీ ముఖ్యంగా డిజిటలైజేషన్ వల్ల ముద్రణ నాణ్యమైన, అంద మైన ముద్రణలతో పాటుగా నేడు "ఈ గ్రంథాలు" ఉపయోగ పడు తున్నాయి. అయినా ముద్రిత గ్రంథ ఉపయోగం ఇంకా తగ్గు ముఖం పట్టలేదు. గ్రంథస్థ విషయాలు ప్రపంచ మంత విస్తృతం, ప్రపంచ వ్యాపితం అవు తున్నాయి. అనేకానేక శాస్త్ర గ్రంధాలు, సృజనా త్మక సాహితీ గ్రంథాలు, ఆధ్యాత్మి కాంశాలు, చరిత్ర, వివిధ విద్యలు, రూపాలు, మానసికోల్లాస ప్రధానాలు, ఒకటేమిటి... వేలాది అంశాలు, లక్షలాది గ్రంథాలు, కోట్లాది పాఠకులు నిత్యం దర్శనాలుగా ఉండడాన్ని చూస్తూనే ఉన్నాం. ఇలాంటి స్థితిలో పుస్తక ప్రదర్శన నిర్వహించడం చాలా ఉపయుక్తం. 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయ వాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. 1980ల్లో రాజమండ్రిలో ఒక దశాబ్దం పాటు పుస్తక మహోత్సవాన్ని అక్కడి నిర్వాహకులు నిర్వహించారు. ఆ పుస్తక ప్రదర్శనలో భాగంగా విజయ వాడలోని ప్రముఖ ప్రచురణ కర్తలు పుస్తక దుకాణాల యజమానులు పాల్గొనేవారు. రాజమండ్రి పుస్తక ప్రదర్శన నిలిపి వేయడంతో నేషనల్ బుక్ ట్రస్ట్ సహాయంతో 1989 అక్టోబరు 29 నుంచి నవంబరు 8 వరకు విజయవాడలో మొదటి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఆ స్ఫూర్తితో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటుచేసి ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా విజయ వాడ పుస్తక మహోత్సవం గత 34 ఏళ్లుగా విజయ వాడ నగరంలో కొనసాగించడం అభినందనీయం. ఈ ఏడు జనవరి 2 నుంచి 12 వరకు ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు విజయవాడ బుక్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది. పుస్తక మహోత్సవ ప్రాంగణానికి వడ్లమూడి విమలాదేవి, ప్రధాన సాహిత్య వేదికకు ప్రముఖ రచయిత డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, ప్రతిభా వేదికకు ప్రముఖ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త జయంత్ నార్లీకర్ పేర్లను ఈ ఏడాది పెట్టారు. ఈ ఏడాది 294 స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈసారి ఎక్కువగా ఇంగ్లీషు బుక్ పబ్లిషర్లు రానున్నారు. పుస్తక ప్రదర్శనలో ఉండే స్టాళ్లలో ప్రతి పుస్తకంపై తప్పనిసరిగా 10శాతం రాయితీ ఇస్తారు. ప్రతి రోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విజయవాడ 36వ పుస్తక మహోత్సవానికి భారీగా తరలివస్తున్న పుస్తక ప్రియులు, స్టాళ్లను పరిశీలించి, అభిరుచులకు తగ్గట్లు కొత్త పుస్తకాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 12వ తేదీ వరకూ బుక్ ఫెయిర్ కొనసాగుతుంది. ఈనెల 12వ తేదీ వరకు జరగనున్న ఈ పుస్తక మహోత్సవంలో మొత్తం 314 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు తెరిచి ఉంటుంది. శని, ఆదివారాల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. నవలలు, జీవిత చరిత్రలు, కథలు, ఆధ్యాత్మిక గ్రంథాలు, విప్లవ సాహిత్య పుస్తకాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానికులే కాకుండా పక్క జిల్లాల ప్రజలూ తరలివస్తున్నారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు అకడమిక్ పుస్తకాలు కొనుగోలు చేస్తున్నారు. బహు భాషలు, రచయితలు, గ్రంథాలు, ముద్రాపకులు, ఒక్కచోట చేరితే అదొక విజ్ఞాన విశ్వమే అవుతుంది. అందుకే చాలా మందికి ప్రీతిపాత్రం గ్రంథాల జాతరా. దేవుని జాతరలో కొలిచినట్లే, గ్రంథాలను పరమ పవిత్రంగా భావించే సంస్కృతి భారతీయులది. కొనే వారు, చదివే వారు, సంరంభాన్ని కన్నుల పండువగా తిలకించే వారు, కౌటుంబిక, స్నేహ, ప్రేమికుల, విద్యార్థుల, రచయితల, కవుల, సాహితీ కారుల బృందాలు ఒక్క చోట కలిసి పండుగ చేసుకునే పుస్తక మేళాకు వెళ్ళిన వారికి మరచిపోలేని అనుభూతులను మిగులుస్తుంది అనేది నూటికి నూరు పాళ్ళు నిజం.

# విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే.. ఏపీలో ఎన్‌హెచ్‌ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు

బెంగళూరు-కడప-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణంలో భాగంగా ఏపీలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సృష్టించింది. ఇది భారత్‌కు, ఆంధ్రప్రదేశ్‌కు గర్వకారణమని సీఎం చంద్రబాబు తెలిపారు.

"బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ (NH`544G)లో వీ/ం రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా NHAI 24 గంటల్లోనే 28.95 లేన్-కిలోమీటర్ల పొడవున, 10,675 మెట్రిక్ టన్నుల తారు కాంక్రీట్‌ను నిరంతరాయంగా వేసి రెండు గిన్నిస్ రికార్డులను నెలకొల్పింది" అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వ దార్శనికత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచస్థాయి రహదారుల నిర్మాణం, ఇంజినీర్లు, కార్మికుల అసాధారణ నిబద్ధత వల్లే ఈ ఘనత సాధ్యమైందని ఆయన

కొనియాడారు. ఇదే కారిడార్‌లోని ఇతర ప్యాకేజీలలో 2026 జనవరి 11 నాటికి మరో రెండు గిన్నిస్ రికార్డుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. భారత్‌మాల ఫేజ్-×× కింద చేపట్టిన ఈ ఆరు లేన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం ఇటీవల వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నుంచి బెంగళూరుకు ప్రయాణ సమయం ప్రస్తుతం ఉన్న 11-12 గంటల నుంచి సుమారు 6 గంటలకు తగ్గనుంది. ఈ రహదారి ఏపీలోని

గుంటూరు, ప్రకాశం, కర్నూలు, కడప జిల్లాల మీదుగా కర్ణాటకలోకి ప్రవేశిస్తుంది. మొత్తం 518 నుంచి 624 కిలోమీటర్ల పొడవున్న ఈ రహదారిని సుమారు రూ.19,200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. ఇందులో కోడికొండ నుంచి అద్దంకి/ముప్పవరం వరకు 342 కిలోమీటర్ల భాగం పూర్తిగా గ్రీన్‌ఫీల్డ్ కాగా, మిగిలిన భాగాన్ని బ్రౌన్‌ఫీల్డ్ పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ఏపీ కనెక్టివిటీకి, సరుకు రవాణాకు కీలకం కానుంది.

# సముద్రంలోకి పోతున్న నీటిని ఎవరైనా వాడుకోవచ్చు

- మొదటి పేజి తరువాయి

రెండు రాష్ట్రాల మధ్య విరోధాలు పెంచుకుని ఇతరులు ఆనందించే పరిస్థితి రావొద్దు" అని హితవు పలికారు. కొందరు మాట్లాడుతున్న మాటలు వింటుంటే... ఆ రాజకీయాలేమిటో తనకే అర్థం కావడం లేదని చంద్రబాబు అన్నారు. గోదావరి నది పైభాగంలో దేవాదుల ఉందని... దేవాదుల నుంచి నీళ్లు వస్తే కింద ఉన్న పోలవరానికే వస్తాయని, కిందికి వచ్చే నీళ్లకు అభ్యంతరం చెబితే అర్థమేమీ ఉండదని అన్నారు. తాము ఎప్పుడూ దేవాదులకు వ్యతిరేకం కాదని, తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు కడుతున్నప్పుడు కూడా అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేశారు. నీళ్లు పొదుపు చేస్తే తెలంగాణకూ లాభమేనని, మిగులు నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో నిల్వ చేసుకోవచ్చని సూచించారు. కృష్ణా నదిలో నీళ్లు తక్కువగా ఉండటంతో పైన ప్రాజెక్టులు కడితే నష్టమని, కానీ గోదావరి డెల్టాను కాపాడుకుని కృష్ణా-గోదావరి అనుసంధానం చేస్తే ఇబ్బంది ఉండదని అన్నారు. రాయలసీమ ఎత్తిపోతలపై కొందరు చేస్తున్న వ్యాఖ్యల్లో అర్థం లేదని, అబద్ధాలను వందసార్లు చెబితే నిజమవుతుందని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

పోలవరం ఆలస్యంపై గత వైసీపీ ప్రభుత్వాన్ని చంద్రబాబు విమర్శించారు. గత ప్రభుత్వం వల్లే 6-7 ఏళ్లు ఆలస్యమైందని, డయాఫ్రం వాల్ పాడైందని ఐఐటీ హైదరాబాద్ నిపుణులు చెప్పిన తర్వాతే వాళ్లకు తెలిసిందని

విమర్శించారు. ఇప్పుడు కొత్తగా డయాఫ్రం వాల్ కడుతున్నామని, ఫిబ్రవరి 15లోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వైసీపీ అక్రమాలపై దర్యాప్తు జరుగుతోందని, కానీ దర్యాప్తు పేరుతో కాలయాపన చేసుకుంటూ పోతే, పనులు పూర్తి చేయడానికి చాలా కాలం పడుతుందని చెప్పారు. అనుమతులు లేని ప్రాజెక్టులకు రూ. 2 వేల కోట్లు ఖర్చు పెట్టారని... ఎన్జీటీకి రూ. 100 కోట్ల జరిమానా కట్టారని దుయ్యబట్టారు.

# కుక్క ఏ మూడ్ లో ఉందో ఎవరూ ఊహించలేరు

- మొదటి పేజి తరువాయి

జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజారియాలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీలో వీధి కుక్కలను షెల్టర్ హోంలకు తరలించాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్ ను ధర్మాసనం ఈ రోజు విచారించింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. వీధుల్లో తిరిగే కుక్క కరుస్తుందని భావించినపుడు స్థానికులు అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. అధికారులు ఆ శునకాన్ని తీసుకువెళ్లి స్టెరిలైజ్ చేసి వదిలిపెడతారని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. స్టెరిలైజ్ చేశాక మనుషులను కరవకుండా వాటికి కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పడం మర్చిపోయినట్టున్నారని వ్యాఖ్యానించింది. మనుషులను కరవడం మాత్రమే కాదు.. వీధుల్లో కుక్కలు పరిగెత్తడం వల్ల వాహన ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని ధర్మాసనం గుర్తు చేసింది.

ప్రమాదం జరిగాక చికిత్స తీసుకోవడం కన్నా ముందే జాగ్రత్త పడడం మంచిదని ధర్మాసనం అభిప్రాయపడింది. వీధుల్లో, స్కూళ్లు, విద్యాసంస్థల

చుట్టుపక్కల కుక్కలు సంచరించాల్సిన అవసరం ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. వీధుల్లో సంచరించే ప్రతీ కుక్క మనుషులను కరవకపోవచ్చు కానీ రోడ్లపై అవి అడ్డదిడ్డంగా పరుగులు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం మాత్రం ఉందని ధర్మాసనం పేర్కొంది.

# రాజాసాబ్ ప్రీమియర్ షో టైట్.. ఏపీలో వెయ్యి రూపాయలు.. జీవో విడుదల

- మొదటి పేజి తరువాయి

ఏపీలో జనవరి 8న సాయంత్రం 6 గంటలకే ప్రదర్శించుకోవచ్చని ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. అర్ధరాత్రి 12 గంటల లోపు ప్రీమియర్ షోకు పర్మిషన్ ఇచ్చింది. ఈ లెక్కన చూసుకుంటే.. ఏపీలో జనవరి 8నే 'ది రాజా సాబ్' రెండు స్పెషల్ షోలు ప్రదర్శించే అవకాశాలున్నాయి. ఇక.. సినిమా విడుదలయిన రోజు నుంచి.. అంటే జనవరి 9 నుంచి పది రోజుల వరకూ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్‌యపై 150 రూపాయలు, మల్టీప్లెక్స్‌శ్రీల్లో టికెట్‌శ్రీపై 200 రూపాయలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ప్రభాస్ హీరోగా మారుతి రూపొందిస్తున్న చిత్రం 'ది రాజా సాబ్'. ఈ సినిమా నుంచి 'నాచో.. నాచో' వీడియో సాంగ్ కూడా విడుదలైంది. 'రాజా సాబ్' ట్రైలర్ 2.ా పేరుతో మరో ట్రైలర్ విడుదలైన సంగతి తెలిసిందే. రాజాసాబ్‌కు నాయనమ్మ అయిన గంగమ్మ (జరీనా వాహబ్) అన్ని మర్చిపోతుంటుంది. కానీ తన భర్త (సంజయ్ దత్)ను మాత్రం మర్చిపోలేక ఇబ్బంది పడుతుంటుంది.

మిస్టీరియస్ పర్సన్ అయిన తన తాత గురించి తెలుసుకునేందుకు మయసభ లాంటి తాత హవేలీలోకి అడుగుపెడతాడు. అక్కడున్న వస్తువులు, పెయింటింగ్స్, ఆర్కిటెక్చర్ లాంటివన్నీ హిప్నటైజ్ చేసేలా డిజైన్ చేసి, అందులోకి అడుగుపెట్టిన వాళ్లు ట్రాన్స్‌లోకి వెళ్లేలా చేస్తాడు తాత.

అంతేకాదు దుష్ట శక్తులను ఆవాహనం చేసుకున్న తాత బంగ్లాలో అడుగడుగునా ప్రమాదాలే. అంత ప్రమాదకరమైన ఆ భవనంలోకి రాజా సాబ్ ఎందుకు వెళ్లాల్సి వచ్చింది... భూత ప్రేతాలు, హిప్నాటిజం చిక్కుముడుల నుంచి ఎలా బయటపట్టాడు అనేది అసలు కథ. ఓవైపు భయపడుతున్నట్టుగా, మరోవైపు ధీరుడిగా డిఫరెంట్ మేకోవర్స్‌తో ప్రభాస్ కనిపించాడు.

# కేటీఆర్ ర్యాలీలో జగన్ జెండాలు

- మొదటి పేజి తరువాయి

ఈ ర్యాలీలో అనూహ్యంగా ఏపీ మాజీ సీఎం జగన్ ఫొటోలు, వైసీపీ జెండాలు కనిపించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. వైసీపీ కార్యకర్తలు, అభిమానులు కూడా ఈ ర్యాలీలో పాల్గొని జై జగన్, జై కేటీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతున్నాయి. రెండు పార్టీల మధ్య స్నేహబంధాన్ని మరోసారి గుర్తు చేస్తున్నాయి. బీఆర్ఎస్, వైసీపీ పార్టీల మధ్య ముందు నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్, ఏపీలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా కేసీఆర్, జగన్ మధ్య స్నేహపూర్వక వాతావరణం కొనసాగింది. రాజకీయ విషయాల్లో ఒకరికొకరు మద్దతు తెలుపుకునేవారు. ఇటీవల జగన్ పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిలో జగన్ నివాసం వద్ద కేసీఆర్, కేటీఆర్, జగన్ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా రెండు పార్టీల సాన్నిహిత్యం మరోసారి బయటపడింది.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసు... కోర్టుకు చేరిన ఎఫ్ఎస్ఎల్ కీలక నివేదిక

- మొదటి పేజి తరువాయి

సేకరించిన డిజిటల్ ఆధారాలపై ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఫీూా) నివేదిక కోర్టుకు చేరింది. ఈ నివేదికను సిట్ అధికారులు తీసుకునే అవకాశం ఉంది. స్కామ్ బయటపడిన వెంటనే చాలా మంది నిందితులు తమ మొబైల్ ఫోన్లను ధ్వంసం చేశారని, రీసెట్ చేశారని ఆరోపణలు ఉన్నాయి. అయినా ఆధునిక ఫోరెన్సిక్ సాంకేతికతతో డిలీట్ అయిన డేటా, కాల్ రికార్డులు, చాట్స్, ఫైల్స్‌ను రికవరీ చేసినట్టు సమాచారం. ఈ రికవరీ డేటాలో ఏం ఉందో తెలిస్తే కేసు మరింత లోతుగా సాగే అవకాశం ఉంది. ఈ రిపోర్ట్ సిట్ చేతికి అందితే... ఆర్థిక లావాదేవీలు, రాజకీయ నాయకులతో సంబంధాలు, లంచాలకు సంబంధించిన ఆధారాలు వెలుగులోకి రావచ్చు. దీంతో ఇప్పటికే నిందితులుగా ఉన్నవారితో పాటు మరికొందరి పెద్ద పేర్లు కూడా వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నివేదికలో ఏం బయటపడుతుందోనని రాజకీయ నాయకులు, అధికారులు ఆందోళన చెందుతున్నారు.

## 'ఐబొమ్మ' రవి బెయిల్ పిటిషన్ కొట్టివేత

- మొదటి పేజి తరువాయి

ఉన్న రవి బెయిల్ కోసం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు.
ఈ పిటిషన్ విచారణ సందర్భంగా రవిపై నమోదైన కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయని పోలీసులు కోర్టుకు వెల్లడించారు. రవికి విదేశాల్లో పౌరసత్వం ఉందని కోర్టు దృష్టికి తీస్తుళ్లారు. బెయిల్ మంజూరు చేస్తే రవి విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో న్యాయస్థానం రవి బెయిల్ పిటిషన్లను కొట్టివేసింది.

## రాయలసీమ కట్టప్ప జగన్ రెడ్డి.. సీమ ద్రోహి

- మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించిన కాలువలను వెడల్పు చేసి ఎక్కువ నీటి సామర్థ్యంతో సీమ రైతాంగానికి నీరందించాలనే ఆలోచన జగన్ ఐదేళ్ల పాలనలో చేయలేదు. కొత్త రిజర్వాయర్లు కట్టాలి. ఉన్న రిజర్వాయర్లను రిపేరు చేయాలి. దీని ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. ఆ పని జగన్ చేయలేదు. కానీ ముఖ్యమంత్రి అయిన వెంటనే జీఓ 365 తెచ్చి 102 ప్రాజెక్టులను రద్దు చేసి రాయలసీమకు, సీమ రైతాంగానికి తీరని ద్రోహం చేశారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**2020లో రాయలసీమ ఎత్తిపోతలపై స్టే**

రాయలసీమ ఎత్తిపోతల పథకంపై 2020లోనే స్టే తెచ్చామని తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు చెప్పారని, మరి నాలుగేళ్లు అధికారంలో ఉన్న జగన్ రెడ్డి ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. దీన్ని బట్టి అబద్ధాలు చెప్పుకుంటూ టీడీపీపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. నాలుగేళ్లు కౌంటర్ దాఖలు చేయలేకపోవడంతో నిజమైన రాయలసీమ ద్రోహులు మీరు కాదా అని నిలదీశారు. రెండు రాష్ట్రాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టాలన్నదే జగన్ ధ్యేయమని ధ్వజమెత్తారు. కృష్ణా జలాలు ఒక్క గ్రావిటీలోనే తీసుకోగలమని, కేఆర్ఎంబీ పర్మిషన్ లేదు, కేంద్రం అనుమతిలేదు, గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతులు లేవని, ఎందుకు ప్రారంభించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వందలాది కోట్లు దుబారా చేశారని, ఇదంతా జగన్ దోపిడీకి నిదర్శనమని ఆరోపించారు. దోచుకొని రెండు రాష్ట్రాల ప్రజల మధ్య విబేధాలు సృష్టించి రెండు రాష్ట్రాల్లో రాజకీయంగా లబ్ది పొందాలనే దురుద్దేశంతోనే ఇదంతా చేశారని ఆయన అన్నారు. రాయలసీమకు నిజమైన ద్రోహి జగన్ రెడ్డేనని, కట్టప్ప ఎలా వెనుకనుంచి పొడిచాడో ఆ విధంగా రాయలసీమ ప్రజలకు ద్రోహం చేశాడని అన్నారు. ముచ్చుమర్రికి సంబంధించిన 13 పంపులకు కరెంట్ బిల్లులు కూడా జగన్ కట్టలేదని మండిపడ్డారు. అనుమతులు లేకుండానే రాయసీమ ఎత్తిపోతలకు రూ.990 కోట్లు ఎందుకు ఖర్చు చేశావని ప్రశ్నించారు. ఇలాంటి నీతిలేని వారికి ప్రజలు ఇప్పటికే 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు.

**అప్పర్ భద్రను జగన్ అడ్డుకోలేదు**

"అప్పర్ తుంగ, అప్పర్ భద్ర ప్రాజెక్టులను కర్ణాటక ప్రభుత్వం కడుతున్నా జగన్ రెడ్డి అడ్డుకోలేదు. కనీసం అభ్యంతరం కూడా చెప్పలేదు. అలగనూరు కుంగింది. రూ.36 కోట్లు కేటాయిస్తే పోయేది కానీ జగన్ ఒక్కరూపాయి ఇవ్వలేదు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది చనిపోవడానికి కారణం జగన్. శ్రీశైలం డ్యామ్ రిస్క్‌లో పడే పరిస్థితి వచ్చింది. కొత్తవి కట్టడం కాదు ఉన్న ప్రాజెక్టులను పట్టించుకోలేదు. హంద్రీనీవాను జగన్ రెడ్డి హయాంలో ఎందుకు ఆధునీకీకరించలేదు" అని విమర్శించారు.

**వైసీపీ బతుకే ఫేక్ ప్రచారం**

"సాక్షి పత్రిక, బ్లూ మీడియా, పేటియం బ్యాచ్‌లు చేసే ఫేక్ ప్రచారాలు ఏది వాస్తవమో, ఏది అవాస్తవమో తెలియక ప్రజలు అయోమయానికి గురయ్యే ఆస్కారం ఉంది. వైఎస్ వివేకాను చంపి నారాసుర రక్త చరిత్ర అని వారి పత్రికలో వారే వేసుకున్నారు. శ్రీవారి పింక్ డైమెండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని చెప్పి అధికారంలోకి రాగానే ఆ కేసు ఉపసంహరించుకున్నారు. 300కు పైగా ఆలయాలపై దాడులు చేసి ధ్వంసం చేశారు. ఏమీ తెలియనట్లు, మాకు సంబంధం లేనట్లు ఉన్నారు. రాజశేఖర్ రెడ్డిని చంపింది రిలయన్స్ వాళ్లంటూ ప్రచారం చేసి అదే అంబానీ కుమారుడిని ఇంటికి ఆహ్వానించి కౌగిలించుకొని వారి మనిషికి ఎంపీ పదవిని కట్టబెట్టిన చరిత్ర వైసీపీది. వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి, ఇతర 700లకు పైగా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా పట్టించుకోకుండా ప్రజల్ని మోసం చేసిన చరిత్ర జగన్‌ది. వై నాట్ 175 అనే నినాదంతో నేడు 11 సీట్లకు పరిమితం అయ్యారు. పులివెందుల ఎమ్మెల్యేగా మిగిలిపోయి కర్నాటక వాస్తవ్యుడు జగన్. ఎన్నికలప్పుడు సిద్ధం సిద్ధం అని చెప్పి హోర్డింగ్స్ పెట్టారు. ఆ పార్టీ ప్యాకప్ అయ్యేందుకు సిద్ధమని సందేశమిచ్చారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శలు చేస్తున్నారు. నిజంగా రెడ్ బుక్ ఉంటే అంకుశం సినిమాలో రామిరెడ్డిని నడిరోడ్డుపై అండర్ వేర్ తో ఎలా నడిపించుకొని తీసుకెళ్లారో అలా కొడాలి నానిని నడిపించేవాళ్లం. అలాంటి కక్ష రాజకీయాలు లేవని రుజువైంది. ఇంటి ముందు ఏ చిన్న అలికిడి వచ్చినా కొడాలి నాని భయపడిపోతున్నాడు. నేడు కొడాలి నాని పరిస్థితి కోడికి ఈకలు పీకేసినట్లైంది. అది లోకేశ్ పవర్" అని వ్యాఖ్యానించారు.

# మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను అభినందించిన వైఎస్ జగన్



**నర్సీపట్నం, పెన్ పవర్ (జనవరి 07) :**నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ తన కుమారులు ఆదర్శ్, విజయ్ అవినాష్‌లతో కలిసి తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నర్సీపట్నం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై గణేష్ వివరించారు. నర్సీపట్నం నియోజకవర్గంలో గ్రామ కమిటీలు, మండల కమిటీల ఏర్పాటు పూర్తయ్యిందని, మొత్తం 11,700లకు పైగా సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. అలాగే పార్టీ డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తవడం జరిగిందని వెల్లడించారు.

నర్సీపట్నం నియోజకవర్గ కమిటీలను పూర్తి చేయడంలో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి, పెట్ల ఉమాశంకర గణేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ బలోపేతానికి ఇలాగే కృషి కొనసాగించాలని సూచించారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా



# ఎస్సీ, ఎస్టీ యువతకు సివిల్స్‌లో స్వర్ణావకాశం

## రూ.4.22 కోట్లతో మూడు ఉచిత సివిల్స్ కోచింగ్ కేంద్రాలు ప్రారంభం
## రుషికొండ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో
## శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 07 :**
ఎస్సీ, ఎస్టీ యువత సివిల్ సర్వీసుల్లో రాణించా లన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని రా ష్ట్ర స్త్రీ, శిశు సంక్షమ, గిరిజన సంక్షమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఆ లక్ష్యంతోనే రూ.4.22 కోట్ల వ్యయంతో రాష్ట్రం లో మూడు ఉచిత సివిల్స్ కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. ఇప్పటికే తిరుపతి, విజయవాడ కేంద్రాల్లో తరగతులు ప్రారంభమయ్యాయని, తాజాగా విశాఖపట్నం రుషికొండలోని అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభిం చారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, అట్టడుగు వర్గాల విద్యార్థులను ఉన్నత స్థా యికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృ ద్ధి పనుల్లో భాగంగా ఇప్పటికే రూ.1,300 కోట్ల తో రహదారులు నిర్మించామని, ఫీడర్ అంబులె న్సులను ప్రవేశపెట్టామని తెలిపారు. అలాగే గిరిజన నియోజకవర్గ కేంద్రాల్లో ఆధునిక వసతు లతో కూడిన 100 పడకల ఆసుపత్రులను అం దుబాటులోకి తీసుకొస్తున్నామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, సంకల్పంతో గిరిజన విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి రీజియన్లలో కోచింగ్ సెంటర్లను ఏర్పా టు చేసి, రాష్ట్రవ్యాప్తంగా అట్టడుగు వర్గాల వి ద్యార్థులకు అవకాశాలు కల్పిస్తున్నామని వివ రించారు. ఒక్కో కేంద్రంలో 100 మంది చొప్పున మొత్తం 340 మందికి ఉచిత కోచింగ్‌తో పాటు వసతి, స్టడీ మెటీరియల్, నాణ్యమైన భోజనం ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తున్నామని, విద్యార్థుల సన్నద్ధతను మెరుగుపరచేందుకు మాక్ టెస్టు లు, లైబ్రరీ, అనుభవజ్ఞులైన మెంటార్ల మార్గద ర్శనం వంటి అన్ని సదుపాయాలను ఒకేచోట కల్పిస్తున్నామని తెలిపారు. చదువు ద్వారానే ఆశించిన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. శిక్షణకు ఎంపికైన విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని అవకాశాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, ఆత్మవిశ్వా సంతో ముందుకు సాగాలని సూచించారు. మొ బైల్ ఫోన్‌ను అనవసరంగా ఉపయోగించకుం డా సమయాన్ని వృథ చేయవద్దని హితవు పలికారు.తన కుమార్తె మెడిసిన్ చదువు తోందని, కుమారుడు సివిల్స్ కోచింగ్ తీసుకుం టున్నాడని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నా రు. తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తూ, ముఖ్యంగా ఆడపిల్లల విషయంలో చదువుతో జీవితంలో స్థిరపడేలా సహకరించాలని సూచించారు.గిరిజన సంక్షమ శాఖ డైరెక్టర్ సదా భార్గవి, శరత్ చంద్ర ఐఏఎస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శరత్ చంద్ర విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కష్టపడి చదివితే ఐఏఎస్, ఐపీఎస్ స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. తమ జీవిత అనుభవాలను పంచుకుంటూ విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాలు ఇచ్చారు.కార్యక్రమంలో యలమంచలి, విజయనగరం, పాడేరు ప్రాంతాలకు చెందిన జ్యోతి, సోమశేఖర్, తౌడమ్మ తమ అనుభవాలను పంచుకుంటూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రి అభ్య ర్థులందరికీ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ గ్రేస్, సాంఘిక సంక్షమ శాఖ డీడీ . రామారావు, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేశ్, ఇతర అధికారులు, శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు.

# సముద్ర వారసత్వానికి వేదికగా విశాఖ లైట్ హౌస్ ఫెస్టివల్



- విశాఖలో లైట్ హౌస్ ఫెస్టివల్ 3.0కు సర్వం సిద్ధం
- జనవరి 9, 10 తేదీల్లో ఎంజీఎం పార్క్ వేదికగా వేడుకలు

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, జనవరి 07 :**విశాఖ నగర వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచె ప్పేలా కేంద్ర పోర్ట్స్, షిప్పింగ్, ఓడరేవుల శాఖ ఆధ్వర్యంలో లైట్ హౌస్ ఫెస్టివల్ 3.0ను ఈ నెల 9, 10 తేదీల్లో ఎంజీఎం పార్క్‌లో నిర్వ హించనున్నట్లు జాయింట్ కలెక్టర్ . మయూర్ అశోక్ తెలిపారు. సముద్ర వారసత్వ పరిరక్షణ, లైట్ హౌస్ టూరిజం విస్తరణ, తీర ప్రాంత ప్రజల భాగస్వామ్యం లక్ష్యంగా ఈ వేడుకలు చేపడు తున్నట్లు పేర్కొన్నారు.ఫెస్టివల్‌లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృ తిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాలు, ప్రత్యేక ఆకర్షణలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి సురేష్ గోపి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, స్థానిక ఎంపీలు, ఎమ్మె ల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని వెల్లడించారు.గోవా, పూరీ నగరాల్లో గతంలో లైట్ హౌస్ ఫెస్టివల్‌ను విజ యవంతంగా నిర్వహించిన అనుభవంతో, ఈ సారి విశాఖలో మరింత వైభవంగా నిర్వహించేం దుకు పోర్టు అధికారులు, జిల్లా యంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేయాలని జేసీ సూచించారు. ఈ వేడుకలతో విశాఖకు పర్యాటక ప్రాధాన్యత మరింత పెరుగుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో లైట్ హౌస్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య చర్యలు, వైద్య శిబిరం ఏర్పాటు, తాగునీటి వసతులు, రవాణా కోసం బస్సుల ఏర్పాటు, ప్రధాన మీడియా మరియు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేపట్టాల ని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించా రు. జిల్లా అధికారులు, పోర్టు అధికారులు సమ న్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో లైట్ హౌస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వీరేంద్ర యాదవ్, విశాఖ పోర్టు కార్యద ర్శి సాంబమూర్తి, సీఏవో రమణమూర్తి, డిప్యూ టీ చీఫ్ ఇంజనీర్ వికాశ్, విశాఖపట్నం ఆర్డీవో సుధాసాగర్, జీవీఎంసీ, ఆర్టీసీ, విద్యుత్, పోలీ స్, అగ్నిమాపక శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గాజువాక నియోజవర్గానికి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ నిధులతో కోటి రూపాయల అభివృద్ధి పనులకు హామీ ఇచ్చిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ :మొల్లి పెంటిరాజు



**గాజువాక :పెన్ పవర్, జనవరి 07:**అమరావతి, ఏపీ సి ఆర్ డి ఏ భవనం లో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ బోర్డ్ డైరెక్టర్స్ సమావేశంలో ఛైర్మన్ సుగుణమ్మ , ఎండి శ్రీనివాసులుపాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృది శాఖ మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోర్డు సమావేశంలో డైరెక్టర్లు ప్రతిపాదించిన సలహాలను, సూచనలను పరిగణలోకి తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర సుందరీకరణ భాగంగా ప్రముఖ పాత్ర పోషించాలని అన్నారు.

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మొల్లి పెంటిరాజు మంత్రి కి వినతిపత్రం అందజేసి, గాజువాక నియోజకవర్గంలో పార్కులు, చెరువుల సుందరీకరణకు సహకరించాలని కోరగా, కోటి రూపాయలు నిధులని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ నుండి అందించాలని, దానికి తగిన చర్యలను తీసుకొని తొందరలోనే ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిగతా బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

# సాక్ష పత్రిక అసత్య కథనంపై పరువునష్టం కేసు

**విశాఖ 12వ అదనపు జిల్లా కోర్టుకు హాజరైన మంత్రి నారా లోకేష్**



**విశాఖ దక్షిణం,, పెన్ పవర్, జనవరి 7 :**
తనపై సాక్ష పత్రిక ప్రచురించిన అసత్య కథనంపై దాఖలు చేసిన పరువునష్టం కేసు విచారణలో భాగంగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సోమవారం విశాఖపట్నం 12వ అదనపు జిల్లా న్యాయస్థానానికి హాజరయ్యారు.ఈ కేసులో ఇప్పటికే రెండు దఫాల క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి కాగా, నేడు మూడోసారి క్రాస్ ఎగ్జామినేషన్ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ తన న్యాయవాదులతో కలిసి కోర్టుకు హాజరై విచా రణకు సహకరించారు.2019 అక్టోబర్ 22న సాక్ష పత్రికలో 'చినబాబు చిరుతిండి.. 25 లక్షలండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనం పూర్తిగా అవాస్తవమని, తన పరువుకు హాని కలిగించేలా ఉందని పేర్కొంటూ మంత్రి లోకేష్ ఈ పరువునష్టం దావాను దాఖలు చేసిన విషయం తెలిసిందే.

ఈ కేసు విచారణ తదుపరి తేదీకి వాయిదా పడింది.

## గిరిజన సంఘం ఆధ్వర్యంలో దుప్పట్లుపంపిణీ.



- బోనంగి చిన్నయ్య పడాల్

**చింతపల్లి పెన్ పవర్ జనవరి 7:-**చింతపల్లి మండలం ఆంధ్ర కాశ్మీర్ గా పేరుపొందిన తాజంగి పంచాయితీ, వంతమామిడి గ్రామంలో కృష్ణ మెటర్నటీ నర్సింగ్ హెూమ్ డాక్టర్ కమల తేజస్వి, ప్రభంజనం వారి ఆర్థిక సహకారంతో 65 దుప్పట్లను ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ప్రముఖ సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నాయన్నారు. సేవా సంఘాలు దుప్పట్లు, నిత్యావసర సరుకులను అందించడంతోపాటు మెడికల్ క్యాంపులు కూడా నిర్వహించాలని ఆదివాసి గిరిజన సంఘం కోరుతుందన్నారు. ఆదివాసి గిరిజన సంఘం పోరాటాలతో గిరిజన చట్టాలు హక్కులు అమలు కోసం శ్రమిస్తుంది అన్నారు. ఆదివాసీలకు వివిధ కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా వారిని వారి హక్కులు పై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహించి ఆదివాసీలను బలోపేతం చేయవలసిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాంగి ధనుంజయ్, ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి పడాల్, స్థానిక గిరిజనులు రామన్న పడాల్, పిట్టల పోతురాజు, తెల్లన్న పడాల్, తిమ్మడ అప్పలనాయుడు, వంతమామిడి గ్రామస్తులు పాల్గొన్నారు.

# నాణ్యతలేని తారురోడ్డు నిర్మాణంపై సెల్లుం గ్రామస్తులు ఆందోళన

## నాణ్యతా ప్రమాణాలు పాటించని సదరు కాంట్రాక్టర్ పై తక్షణమే చర్యలు చేపట్టాలి సెల్లుమ్ గ్రామస్తులు.



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 07.**మండలంలో గల మజ్జిగూడ నుంచి సెల్లుమ్ మీదుగా ఆర్ అండ్ బి రహదారికి కలుపుతూ ప్రధానమంత్రి జన్మన్ సడక్ యోజన నిధులు 104.36 లక్షలు రూపాయలతో కొత్తగా వేసిన తారు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని ఏనుగురాయి పంచాయతీ సెల్లుమ్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుదవారం గ్రామస్తులు మాట్లాడుతూ.. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి తారు రోడ్డు సౌకర్యం కల్పించాలని అనేక మార్లు రాజకీయ నాయకులు, ప్రభుత్వ జిల్లా అధికారులకు వినతి పత్రాలు సమర్పించిన నేపథ్యంలో గత వైసిపి ప్రభుత్వం హయాంలో రోడ్డు మంజూరు చేశారని వారన్నారు. ప్రభుత్వం మారినప్పటికీ కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో తారు రోడ్డు సౌకర్యం కలుగుతుందని ఎంతో సంబరపడ్డామని అయితే తారు రోడ్డు వేసి రెండు దినాలు తిరగకుండా రోడ్డు నిర్మాణంలో సదరు కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రోడ్డు వేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మజ్జిగూడ గ్రామం నుంచి సెల్లుమ్మ్ వరకు తారురోడ్డు మంచిగా వేశారని, సెల్లుమ్ నుండి ఆర్ అండ్ బి రహదారి వరకు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వేశారని వారు రోడ్డు సూపర్వైజర్ కు అడిగితే పొంతనలేని సమాధానం చెప్పడంతో ఆందోళన చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా తారు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డ తమకు దాసరిపుట్టు జంక్షన్ నుండి సెల్లు గ్రామం మీదుగా మజ్జిగూడ గ్రామం వరకు 1.80 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని తక్షణమే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో వి.వేనమ్మ, ఆర్లబ్ ముకుందు, తామరు కృష్ణారావు, కించాయి భాస్కరరావు, టి. సరస్వతి, .రాధిక, .పద్మా, . బీమల, తాంగుల ద్రౌపది, అల్లాబు రామదాసు, .పొదలం, ఏ. ముకుందు, .విజయశాంతి, .రామారావు, కొర్ర ధనుర్జాయ్, తాంగుల రామకృష్ణ, ఏ.సిద్దేశ్వరరావు, టి.బుద్దు, టి.ముక్తమ్మ లు పాల్గొన్నారు.

# అక్రమ డిప్యూటేషన్లు మీద ఉన్న శ్రద్ధ..! ఆదివాసి విద్యార్థుల సంక్షమం కోసం ఎందుకు లేదు...?

- ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ.
- మూల్ నివాసి సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై కుమార్

**పాడేరు , పెన్ పవర్, జనవరి 7:** ఆదివాసి ప్రాంతంలో మినీ గురుకులాలు మరియు గిరిజన సంక్షమ ఆశ్రమ పాఠశాలలలో అక్రమ డిప్యూటేషన్లు మీద ఉన్న ప్రేమ, ఆదివాసి విద్యార్థుల సంక్షమంపై గిరిజన సంక్షమ శాఖ అధికారులు ఎందుకు దృష్టి పెట్టడం లేదని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడ రాధాకృష్ణ,
మూల్ నివాసి సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై కుమార్. ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ: ఆదివాసి ప్రాంతంలో ఉన్నటువంటి, మినీ గురుకులాలు అంజలి శనివారం, జి మడుగుల, గోమంగి. మరియు గిరిజన సంక్షమ ఆశ్రమ పాఠశాలలలో అక్రమ డిప్యూటేషన్ల వల్ల విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటుపడుతుందని, డిప్యూటేషన్ మీద వెళ్లినవారు వారి యొక్క సంపాదన ధ్యేయంగా విద్యార్థుల సంక్షమం పూర్తిగా మర్చిపోతున్నారు, దీనికి పూర్తిగా అధికారుల ఆద్యం పోస్తున్నారు. మినీ గురుకులాల్లో, ఆశ్రమ పాఠశాలలో అనేకమంది విద్యార్థులు చనిపోతున్నారు. మరియు విద్యార్థులకు అందించవలసిన మెను సక్రమంగా అమలు చేయకుండా, అనేకమార్లు ఫుడ్ పాయిజన్ అయినా వాటిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేదని, వాటిపై శ్రద్ధ చూపించకపోవడం చాలా దుర్మార్గమని అన్నారు.

ఉదాహరణకు : పెదబయలు మండలం గోమంగి మినీ గురుకులంలో, కొంతమంది రాజకీయ నాయకుల స్వప్రయోజనాల కోసం. గతం నుండి నేటి వరకు తమకు అనుకూలమైనటువంటి వ్యక్తులను, డిప్యూటేషన్లు మీద పంపించి, విద్యార్థుల సంక్షమం పూర్తిగా మరిచిపోయి సంపాదన ధ్యేయంగా ఎంచుకున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది.

ఇటీవల గోమంగి మినీ గురుకులంలో డిప్యూటేషన్ మీద వెళ్లినటువంటి కొద్దిమంది. విద్యార్థులు పడుకునే, మంచాలు( బెడ్లు ) అమ్మి వేసిన పరిస్థితి ఉంది. ఈ విషయం గతంలో పనిచేసినటువంటి గిరిజన సంక్షమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ గారికి మరియు ఇప్పుడు వరకు గురుకులం లో ఓ ఎస్ డి పనిచేస్తున్న వారికి తెలిసినప్పటికీ, కనీసం వాటి పై విచారణ జరిపించలేదన్నారు. అదేవిధంగా అదే స్కూల్లో అనేకమార్లు ఫుడ్ పాయిజన్లు, మెనూ అమలు చేయలేని దాఖలలో ఎన్నో ఉంది. కానీ వాటిపై గిరిజన సంక్షమ శాఖ అధికారులు కనీసం స్పందించకపోవడం చాలా దుర్మార్గం. మొన్నటి వరకు గురుకులంలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులతో ఇన్చార్జి బాధ్యతలు నడిపిస్తూ, మళ్లీ ఆగమేగాల మీద విద్యా సంవత్సరం ముగింపు దశకు వచ్చిన తర్వాత కూడా డిప్యూటేషన్ మీద పంపించడం వెనక రహస్యం ఏమిటని, వారు ప్రశ్నించారు.



కొంతమంది వ్యక్తులు అధికారులు కుమ్మక్కై విద్యార్థుల చదువులు పక్కనపెట్టి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని, వారు మండిపడ్డారు. మినీ గురుకులాలలో తక్షణమే అక్రమ డిప్యూషన్ రద్దుచేసి గురుకులాల్లో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులను వార్డెన్, ఓఎస్ఓ పోస్టులకు నియమించాలని, ఒక ప్రకటనలో తెలిపారు.

# ఇంజరి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఆర్డీవో విచారణ



**పాడేరు, పెన్ పవర్,జనవరి 07:**
పెదబయలు మండలం ఇంజరి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ ఎ ఎస్. దినేష్ కుమార్ వారి ఆదేశాల మేరకు విచారణ వేగవంతమైందని ఇంచార్జ్ ఆర్డిఓ ఎం.లోకేశ్వర రావు బుధవారం పెదబయలు ఎంపీడీవో కార్యాలయంలో విచారణాధికారిగా హాజరయ్యారు.
గత కొంతకాలంగా ఇంజరి పంచాయతీకి చెందిన నిధులు పక్కదారి పట్టాయని, రికార్డుల్లో చూపిన పనులకు, క్షత్రస్థాయిలో జరిగిన పనులకు పొంతన లేదని వచ్చిన ఫిర్యాదులపై ఆర్డీవో లోతుగా విచారించారు. పంచాయతీ కార్యదర్శి, ఇతర సిబ్బందిని పిలిపించి నిధుల వ్యయం, నగదు ఉపసంహరణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. విచారణలో తేలిన అంశాలను నివేదిక రూపంలో జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ?పంచాయతీ నిధులపై ఉన్నతాధికారులు నేరుగా విచారణకు దిగడంతో మండలంలో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.
తదుపరి విచారణ నిమిత్తం క్షత్ర స్థాయిలో ఎం బుక్ ల ఆధారంగా 2022 - 2024 సంవత్సరం లలో జరిపిన పనుల వివరాలను తీసుకొని, ఆ సమయంలో పనిచేసిన అప్పటి జేఈలను కూడా విచారణ జరవలసి ఉందన్నారు.

# ఫార్మా ఉత్పత్తుల ప్రదర్శనశాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి.

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.




**పరవాడ (పెన్ పవర్) జనవరి 7:** జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో ఉన్న క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఫార్మా ఉత్పత్తుల ప్రదర్శనశాలను (ఎక్స్పో ఎగ్జిబిషన్) పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఫార్మా ప్రతినిధులు, నిర్వాహకులు ఎమ్మెల్యేను వేద పండితుల మంత్రోర్చనలతో ఘన స్వాగతం పలికారు. సాలువ కప్పి , గజమాలతో సత్కరించారు. మూడు రోజులు పాటు జరిగే ఫార్మా ఉత్పత్తుల ప్రదర్శన స్టాల్స్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అనంతరం ఫార్మా ఉత్పత్తుల పరికరాలకు సంబంధించిన స్టాల్స్ ను పరిశీలించారు. ఫార్మా ఉత్పత్తుల పనితీరును నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఫార్మా ఉత్పత్తుల ప్రదర్శనశాలను పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఉన్న యంత్రాలను వినియోగించి తరచూ ఫార్మా పరిశ్రమల్లో జరుగుతున్న ప్రమాదాలను అరికట్టి ప్రాణ నష్టం జరగకుండా చూడాలని కోరారు. ప్రతి సంవత్సరం ఫార్మా ఉత్పత్తుల ప్రదర్శనశాలను ఏర్పాటు చేయడం సంతోషకరమని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫార్మా ప్రతినిధులు సూర్య ప్రకాశరావు, సీఎన్ రావు(లారస్),జెట్టి సుబ్బారావు(సియాంక్), శివరాంప్రసాద్ (వర్ధంతి) ఫార్మా జల్ అప్పారావు, రక్షత్ గ్రూపు దొర, బి. రామకృష్ణ ( లారస్)
నిర్వాహకుడు శుక్ల, వివిధ ఫార్మ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన స్టాల్స్ నిర్వాహకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన నాతవరం విద్యార్థిని,విద్యార్థిలు....



**నాతవరం,పెన్ పవర్ (జనవరి 07):** జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన నాతవరం విద్యార్థిని విద్యార్థులు విశాఖ తీరంలో మూడవ జాతీయ సబ్ జూనియర్, జూనియర్ సీనియర్ బీచ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో నాతవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు వి రష్మిత,బి.దుర్గా,ఆర్.కార్తీక్ బంగారు పథకాలు ఎస్.గణేష్, ఇ.కావ్యశ్రీ,ఎస్.కావ్య కాంస్య పథకాలు,పి.సత్యవేణి, బి.దుర్గ భవాని,ఎం.గంగరాజు, ఎస్.వికాస్ రాజ్,కే.నాని,జి. లలిత,జి.లక్ష్మప్రసన్న రజిత పథకాలు సాధించారు. అలాగే మార్చి లో థయి లాండ్ లో జరగనున్న అంతర్జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే.సత్యనారాయణ, క్రీడా ఉపాధ్యాయులు టి.అనురాధ, ఆర్ ఎస్ ఎస్ ఆర్ ఎస్ దేములు,పీ. వలసయ్య విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా నిర్వహించిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 7:** కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మై భారత్ ఉ విశాఖపట్నం ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను గూడెం కొత్త వీధి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీల్లో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి. రమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ముందుండాలని, క్రీడల ద్వారా మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డియర్ ఫౌండేషన్ అధినేత రంజిత్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు,




విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విశాఖ రిఫైనరీలో భారీ సాంకేతిక విప్లవం



- హెచ్పీసీఎల్ ఆర్‌యుఎఫ్ ప్రారంభం
- 93 శాతం క్రూడ్ ఆయిల్ అవశేషాలు అధిక విలువ ఉత్పత్తులుగా మారనున్నాయి

**ములగాడ, పెన్ పవర్, జనవరి 07 :** హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్పిసిఎల్) తన విశాఖ రిఫైనరీలో అవశేషాల అప్‌గ్రేడేషన్ సదుపాయాన్ని ఆర్.యు.ఎఫ్ విజయవంతంగా ప్రారంభించింది. దీతో దేశం లోతైన మార్పిడి శుద్ధి డీప్ కన్వర్షన్ రిఫైనింగ్ రంగంలో కొత్త మైలురాయిని చేరుకుంది. ఇది దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రధానమంత్రి ఆత్మనిర్భ ర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా, ఈ ప్రాజెక్టు కోసం కావలసిన పరికరాలలో చాలా వాటిని దేశీయంగా తయారు చేశారు. దేశంలో ఈ తరహా మొట్టమొదటి సదుపాయం కావడం తోపాటు, ఈ ప్రాజెక్టు భారతీయ ఇంజినీరింగ్ ప్రతిభను ప్రతిబింబిస్తుంది. ప్రపంచంలోనే అ త్యంత భారమైన సుమారు 2,200 మెట్రిక్ టన్నుల బరువున్న మూడు ఎల్సీఉమ్యాక్స్ రియాక్టర్లలో ఇది ఒకటి. 3.55 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ సదుపాయం బాటమ్ ఆయిల్స్(అవశేష చమురులో 93 శాతం భాగాన్ని అధిక విలువ గల ఉత్పత్తులుగా మార్చగలదు. ఇది “ఎల్సీ మ్యాక్స్” పద్ధతిపై ఆధారపడి పనిచేస్తుంది. రిఫైనరీ ఉత్పత్తి దిగు బడిని సుమారు 10 శాతం పెంచే సత్తా దీనికి ఉంది. ఈ విస్తరణతో రిఫైనరీ స్థూల లాభాలు గ్రాస్ రిఫైనింగ్ మార్జినులు గణనీయంగా పెరగనున్నాయి. అధిక విలువ గల ఉత్పత్తుల కలయిక, భారమైన ముడి చమురును ప్రాసెస్ చేసే స్వేచ్ఛ, ప్రతి బ్యారెల్ నుంచి అధిక విలు వనూ సాధించే సామర్థ్యం దీని ప్రత్యేకత. మిడిల్ డిస్టిలేట్ ఉత్పత్తుల్లో పెరుగుదలతో దేశీయ మార్కెటింగ్‌లో వినియోగించే హై స్పీడ్ డీజిల్‌ను స్వయంగా తయారు చేసుకునే అవకా శం లభిస్తుంది. దీంతో బాహ్య సరఫరాపై ఆధా రపడాల్సిన అవసరం తగ్గుతుంది. సప్లై చెయి న్ బలపడటమే కాకుండా, లాభదాయకత కూ డా పెరిగే అవకాశం ఉంది. శక్తి వినియోగ సామ ర్థ్యాన్ని పెంచేలా ప్రాజెక్టును రూపుదిద్దారు. మెరుగైన ఉష్ణ సంకలనం, ప్రాసెసింగ్ సామర్థ్యం కారణంగా శుద్ధీకరణ కర్మాగారం శక్తి వినియోగ సూచిక ఎనర్జీ ఇంటెన్సిటీ ఇండెక్స్ తగ్గింది. ఇది ఆపరేటింగ్ ఖర్చులను తగ్గించడమేగాక, స్థిరత్వ లక్ష్యాలను సాధించడంలోనూ దోహదపడు తుంది. ప్రస్తుతం విశాఖ రిఫైనరీ నెల్సన్ కాంప్లెక్సిటీ సూచిక 11.6కు చేరింది. దీంతో ఇది దేశంలోనే అత్యంత ఆధునిక, లోతైన మార్పిడి శుద్ధీకరణ కేంద్రాలలో ఒకటిగా నిలిచింది. దీర్ఘ కాల లాభదాయకత, గ్లోబల్ ప్రామాణిక స్థాయి లో పనితీరు సాధించడానికి ఇది తోడ్పడుతుం ది. భౌతిక ఆరంభం పూర్తిచేసిన హెచ్పిసిఎల్ తన కొత్త డిజిటల్ వ్యవస్థను కూడా ప్రారంభిం చింది. ఈ వ్యవస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పరిజ్ఞానంతో యంత్రాల యొక్క ఉష్ణ గణన నమూనాలను ఉపయోగించి ముందస్తు విశ్లేషణలు, ఆప్టిమైజేషన్‌ను అందిస్తుంది. దీని వల్ల స్థిరమైన, సమర్థవంతమైన ఉత్పత్తి కొనసా గుతుంది. ప్రాజెక్టు విజయవంతం కావడానికి సహకరించిన పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, అలాగే చట్టసబ్య సంస్థలకు హెచ్పిసిఎల్ ధన్యవాదాలు తెలిపింది. అలాగే లార్ధ్ అండ్ టూబ్రో, ఇంజినీ రింగ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఈఐఎల్, సిఎల్‌జీ వంటి భాగస్వాముల మద్దతుతో ఈ ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేయగలిగినట్లు సంస్థ తెలిపింది.

# కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్లలో జిల్లా ఎస్పి తనిఖీలు




**గొలుగొండ, పెన్ పవర్ (జనవరి 07) :** జిల్లా పోలీస్ యంత్రాంగం పనితీరును మెరుగు పరచడంలో భాగంగా, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం కృష్ణదేవిపేట మరియు గొలుగొండ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్సై వి.ఋషికేశ్వరరావు, గొలుగొండ ఎస్సై పి.రామారావు ఎస్పీకి సాదర స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసులు, స్టేషన్ రికార్డులు మరియు నిర్వహణ తీరును క్షణ్ణంగా తనిఖీ చేశారు.
గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీ మరియు విక్రయాల వంటి కార్యకలాపాలపై కఠినంగా వ్యవహరించాలని, వీటి నెట్‌వర్క్‌ను పూర్తిగా ధ్వంసం చేయాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తి యాప్ మరియు ఇతర మహిళా చట్టాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.
నేర నియంత్రణలో భాగంగా గ్రామాల్లో మరియు కీలక జంక్షన్లలో సీసీ_మెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని, కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. అనంతరం భీమవరం చెక్ పోస్టును సందర్శించిన, గంజాయి తరలింపును అడ్డుకోవడానికి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షణ్ణంగా తనిఖీ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల రక్షణే ధ్యేయంగా పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.
పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాలని,
రాత్రి సమయాల్లో గస్తీ మరియు తనిఖీలను ముమ్మరం చేయాలని,
పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి, వారికి తక్షణ సహాయం అందించాలని సూచనలు చేశారు. ?ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో మమేకమైన ఎస్పీ తుహిన్ సిన్హా, వారి సమస్యలను అడిగి తెలుసుకొని సానుకూలంగా స్పందించారు.

# హుకుంపేట పంచాయతీలో వేగంగా పారిశుధ్య పనులు

సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ



**హుకుంపేట, పెన్ పవర్,జనవరి 7:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో హుకుంపేట మండలంలోని హుకుంపేట పంచాయతీలో పారిశుధ్య పనులు వేగంగా చేపడుతున్నట్లు సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ తెలిపారు. పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులతో కలిసి గ్రామంలో విస్తృతంగా శుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో పంచాయతీ సిబ్బంది, క్లాప్ మిత్రులకు సహకరించాలని కోరారు. ప్రతిరోజూ చెత్త సేకరణ జరుగుతున్నప్పటికీ కొంతమంది ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల పారిశుధ్య లోపం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ పారిశుధ్యంపై బాధ్యత వహిస్తేనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని, పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యం కాపాడుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాదేవి, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, పంచాయతీ అభివృద్ధి అధికారి సత్యనారాయణ, పేసా కమిటీ సభ్యులు మజ్జి రామకృష్ణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 15 వాలీబాల్ కోర్టులు ప్రారంభం...

జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పూజారి శైలజ....



**నాతవరం,పెన్ పవర్ (జనవరి 07):** అనకాపల్లి జిల్లాలో జనవరి 14న 15 వాలీబాల్ కోర్టులను ప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి పూజారి శైలజ అన్నారు. బుధవారం ఆమె స్థానిక మండల అభివృద్ధి అధికారి ఎం.సత్య శ్రీనివాస్ తో కలిసి నాతవరంలో నాలుగు లక్షల రూపాయల వ్యయంతో నూతన గా నిర్మిస్తున్న వాలీబాల్ కోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశ్యంతో క్రీడల పట్ల ఆసక్తి చూపుతారనే ఉద్దేశ్యంతో వాలీబాల్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యువకుల క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో క్రీడాకోటలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, నాతవరం పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం,మాజీ ఎంపీపీలు నేతల విజయ్ కుమార్, పారుపల్లి కొండబాబు, గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు పైల సూరిబాబు,అనకాపల్లి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ఇటంశెట్టి సీతారాం, మండల టిడిపి నాయకులు బంగారు సూరిబాబు,టిడిపి మండల సోషల్ మీడియా కన్వీనర్ శెట్టి గోపి,మాజీ మండల యూత్ అధ్యక్షులు శెట్టి లోవ, గ్రామ టిడిపి పార్టీ మాజీ అధ్యక్షులు శెట్టి నానాజీ, గొర్లి లోవ,పినిరెడ్డి పండు, పి ఆర్ జె ఈ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రశేఖర్‌ను పరామర్శించిన వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రతినిధులు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 7 :** విశాఖపట్నం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ వైస్ చైర్మన్ వెంకుమహంతి చంద్రశేఖర్ మాతృమూర్తి వెంకుమహంతి బాలమణి (84) ఇటీవల మృతి చెందడంతో, మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌తో పాటు కమిటీ డైరెక్టర్లు బుధవారం ఆయన నివాసానికి వెళ్లి సంతాపం తెలిపారు. జీవీఎంసీ 52వ వార్డు, న్యూ కరాసలో గల చంద్రశేఖర్ నివాసంలో దివంగత బాలమణి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించిన కమిటీ ప్రతినిధులు, ఈ అకాల మరణం పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాలమణి మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. దివంగతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి అపర్ణ ప్రసాద్‌తో పాటు డైరెక్టర్లు లలిత, జీవ, లత, శోభ, సుభాని, జగదీశ్వరి, రమాబాయి, గునిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే కుటుంబ సభ్యులు వెంకుమహంతి రాజ్యలక్ష్మి, ఉద్దవులు జమున ప్రసాద్, యలమంచిలి ప్రసాద్, పట్నాయక్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు మహంతి కవిత, విమంది శ్రీను, సంతోషిని తదితరులు హాజరై సంతాపం తెలిపారు.

# నాతవరంలో పల్లె పండగ 2.0 లో భాగంగా సిసి రోడ్డు ప్రారంభం...

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి లక్ష్యం...
- మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ....




**నాతవరం,పెన్ పవర్ (జనవరి 07):** నాతవరం గ్రామంలో సుమారు 29 లక్షల రూపాయలతో నిర్మించిన సిసి రోడ్డును బుధవారం మండల టిడిపి పార్టీ అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ,జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ సూర్య చంద్ర,పిఎసిఎస్ అధ్యక్షులు అప్పిరెడ్డి మాణిక్యం,గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు పైల సూరిబాబు ప్రారంభించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని, పల్లె పండగ 2.0 కార్యక్రమంలో భాగంగా సిసి రోడ్లను ప్రారంభిస్తున్నామని నందిపల్లి వెంకటరమణ అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. సత్య శ్రీనివాస్,ఏపీవో దాసరి కొండజి,మాజీ ఎంపీపీలు నేతల విజయ్ కుమార్, పారుపల్లి కొండబాబు, అనకాపల్లి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ఇటంశెట్టి సీతారాం,మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు శెట్టి సత్యనారాయణ,తాండవ కాలువ డైరెక్టర్ పారుపల్లి దాసు, మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు బంగారు సూరిబాబు,మాజీ యూత్ అధ్యక్షులు శెట్టి లోవ, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు శెట్టి నానాజీ,సామర్ల రామారావు, వి ఆర్ పి నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు జీవితంలో స్పష్టమైన లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలి

జూనియర్ సివిల్ జడ్జి కుమారి బి.కనకలక్ష్మి




**శృంగవరపుకోట, పెన్ పవర్, జనవరి 7:**
విద్యార్థులు జీవితంలో స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధన దిశగా నిరంతర కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి కుమారి బి. కనకలక్ష్మి సూచించారు. స్థానిక ఏజీఎల్ ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ కళాశాలలో జూనియర్ సివిల్ జడ్జి మరియు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కుమారి బి. కనకలక్ష్మి అధ్యక్షతన బుధవారం న్యాయ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని క్రమశిక్షణతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. నేటి సమాజంలో ప్రతిభను బట్టి అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. క్షణికావేశంలో ప్రేమలు, వ్యామోహాలకు లోనై భవిష్యత్తును నాశనం చేసుకోకుండా తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న ఆశలు, బాధ్యతలను గుర్తించి ముందుకు సాగాలని విద్యార్థులకు హితవు పలికారు.

ప్రత్యేకంగా డ్రగ్స్ మత్తు పదార్థాల వల్ల యువత తీవ్రంగా ప్రభావితమవుతోందని, తెలిసో తెలియకో వాటి ఉచ్చులో పడితే జీవితమే కాకుండా కుటుంబం, సమాజం కూడా నష్టపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాల సాధన వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ అమృత, ప్రిన్సిపాల్ భవాని మాట్లాడుతూ న్యాయ అవగాహన సదస్సులు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై అవగాహన కలిగితే బాధ్యతాయుత పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు.

ఈ సదస్సులో అధ్యాపకుడు అప్పారావు, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు బి. వెంకట్రావు, సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు.

# మంత్రి లోకేష్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బ్రహ్మకుమారిలు



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 7 :** విశాఖ నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం, ఎంవీఎస్ మూర్తి హాలులో ఈరోజు గౌరవనీయులైన మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ని బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సోదరి రామేశ్వరి నూతన సంవత్సరము మరియు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

సోదరి రామేశ్వరి మంత్రి లోకేష్ కి విజయ తిలకము దిద్ది ఆశీర్వదిస్తూ అభినందనలు తెలిపారు. అనంతరం బ్రహ్మకుమారి సంస్థ చేపడుతున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

ఈ సందర్భంగా గతంలో తమ సంస్థ ద్వారా సింహాచలం పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక మ్యూజియం స్థాపన మరియు ప్రాథమిక చికిత్స ఆలయం (ప్రైమరీ హెల్త్ సెంటర్ తరహా సేవా కేంద్రం) ఏర్పాటు కోసం వినతిపత్రం సమర్పించిన విషయాన్ని మంత్రికి గుర్తుచేశారు. ప్రజల ఆధ్యాత్మిక అభ్యున్నతితో పాటు ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు ఎంతో ఉపయుక్తమని వివరించారు. తాజాగా అదే అంశాలపై మరొకసారి సవినయంగా వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ వినతిపత్రాన్ని సాఫ్ట్వేర్ ఇంజనీర్ బీకే శ్రీనివాస్, సోదరి రామేశ్వరితో కలిసి మంత్రి లోకేష్ కి అందజేశారు. మంత్రి బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవలను ప్రశంసిస్తూ, వినతిపత్రాన్ని సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగి, పరస్పర అభినందనలు మరియు శుభాకాంక్షలతో ముగిసింది.

# కృష్ణదేవిపేట, గొలుగొండ పోలీస్ స్టేషన్లలో జిల్లా ఎస్పీ వార్షిక తనిఖీలు




- గంజాయి అక్రమ రవాణా, నాటు సారా నిర్మూలనపై కఠిన ఆదేశాలు
- ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌నే లక్ష్యంగా ఎస్పీ

**అనకాపల్లి, పెన్ పవర్, జనవరి 7 :** స్థానిక అనకాపల్లి జిల్లా పోలీస్ యంత్రాంగం పనితీరును మరింత మెరుగుపర్చే దిశగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా బుధవారం కృష్ణదేవిపేట మరియు గొలుగొండ పోలీస్ స్టేషన్లలో వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా స్టేషన్ల పనితీరు, కేసుల పరిష్కారం, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.రేవతమ్మ, కృష్ణదేవిపేట ఎస్సై వి.ఋషికేశ్వరరావు, గొలుగొండ ఎస్సై పి.రామారావు ఎస్పీకి ఘన స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, క్రైమ్ రికార్డులు, స్టేషన్ డైరీలు, మాలా?నా నిర్వహణ విధానాలను తనిఖీ చేశారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా వేగవంతంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గంజాయి, నాటు సారాపై ఉక్కుపాదం, గంజాయి అక్రమ రవాణా, నాటు సారా తయారీ మరియు విక్రయాలపై ఏమాత్రం ఉపేక్ష లేకుండా కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు.

ఈ అక్రమ కార్యకలాపాల వెనుక ఉన్న నెట్‌వర్క్‌ను పూర్తిగా గుర్తించి ధ్వంసం చేయాలని స్పష్టం చేశారు. పాత నేరస్థులపై నిరంతర నిఘా కొనసాగించాలని, అనుమానితుల కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, రోడ్డు భద్రత చర్యలను కఠినంగా అమలు చేయాలని సూచించారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన 'శక్తి యాప్', మహిళా చట్టాలపై గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

నేర నియంత్రణలో భాగంగా గ్రామాలు, ముఖ్యమైన కూడళ్లలో సీసీటీవీ మెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలను పోలీసింగ్‌లో భాగస్వాములను చేయాలని, పోలీస్‌ఉప్రజల మధ్య విశ్వాసాన్ని పెంచాలని సూచించారు.

భీమవరం చెక్ పోస్టు తనిఖీ అనంతరం భీమవరం చెక్ పోస్టును సందర్శించిన జిల్లా ఎస్పీ, గంజాయి తరలింపును అడ్డుకునేందుకు సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా ప్రజల రక్షణే లక్ష్యంగా పని చేయాలని సూచించారు.

రాత్రి గస్తీ, ఫిర్యాదుదారుల పట్ల మర్యాద

రాత్రి సమయాల్లో గస్తీ మరియు తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి తక్షణ సహాయం అందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బందితో మమేకమైన జిల్లా ఎస్పీ సమస్యలను అడిగి తెలుసుకుని సానుకూలంగా స్పందించారు. విధుల్లో నిబద్ధతతో పనిచేస్తే ప్రజల నుంచి గౌరవం లభిస్తుందని, సమాజంలో పోలీసులపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.

# అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖలో 'ఈ-ఆఫీస్' శిక్షణా కార్యక్రమం



**డిజిటల్ గవర్నెన్స్‌తో వేగవంతమైన, పారదర్శక సేవలే లక్ష్యం**

**అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు**

**అనకాపల్లి, పెన్ పవర్, జనవరి 7:** జిల్లా పోలీస్ శాఖలో పరిపాలనా ప్రక్రియలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో 'ఈ-ఆఫీస్' విధానంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమం బుధవారం అనకాపల్లి పట్టణంలోని రోటరీ క్లబ్‌లో జరిగింది. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, జిల్లా అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పోలీస్ శాఖలో పూర్తిస్థాయిలో డిజిటల్ విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు.

ఈ-ఆఫీస్ విధానం ద్వారా ఫైళ్లను కాగిత రహితంగా (పేపర్‌లెస్) వేగంగా ప్రాసెస్ చేయవచ్చని, డిజిటల్ సంతకాల వినియోగం ద్వారా పనుల్లో పారదర్శకత పెరుగుతుందని అదనపు ఎస్పీ వివరించారు. దీనివల్ల ఫైళ్ల నిర్వహణలో జాప్యం తగ్గి, ప్రజలకు సంబంధించిన సమస్యలు త్వరగా పరిష్కరించడానికి వీలు కలుగుతుందని అన్నారు.

ఈ శిక్షణా కార్యక్రమంలో ఐటీ కోర్ టీమ్ సభ్యులు పోలీస్ సిబ్బందికి ఈ-ఆఫీస్ సిస్టమ్ వినియోగం, ఫైళ్ల నిర్వహణ, డిజిటల్ సంతకాలు, ఆన్‌లైన్ కరస్పాండెన్స్ వంటి అంశాలపై ప్రాయోగికంగా అవగాహన కల్పించారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, స్టేషన్ రైటర్లు, కార్యాలయ సిబ్బంది ఈ డిజిటల్ విధానంపై పూర్తి అవగాహన పెంచుకొని సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు లక్ష్మణమూర్తి, రమేష్, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, ఐటీ టీమ్ సభ్యులు, అలాగే జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ-ఆఫీస్ విధానం అమలుతో అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ డిజిటల్ దిశగా మరో ముందడుగు వేసిందని అధికారులు అభిప్రాయపడ్డారు.

# మంత్రి నారా లోకేష్‌కు నాయి బ్రాహ్మణుల సమస్యలపై వినతిపత్రం



**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, జనవరి 7 :** విశాఖ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి నాయి బ్రాహ్మణుల సమస్యలపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి నరవ పైడిరాజు వినతిపత్రం సమర్పించారు. విశాఖ ఎయిర్‌పోర్టులో ఈ సందర్భంగా మంత్రిని కలిసిన నరవ పైడిరాజు నాయి బ్రాహ్మణుల జీవనోపాధి, సంక్షమానికి సంబంధించిన పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ముందుగా నాయి బ్రాహ్మణుల సెలూన్ షాప్‌లకు ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి నాయి బ్రాహ్మణుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. అయితే 200 యూనిట్లు దాటిన తర్వాత వచ్చే విద్యుత్ బిల్లులను కమర్షియల్‌గా కాకుండా డొమెస్టిక్ బిల్లులుగా పరిగణలోకి తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అలాగే ఆయుర్వేద వైద్యానికి మూలపురుషులైన మహర్షి శ్రీ భగవాన్ ధన్వంతరి జయంతిని ప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి అధికారికంగా ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

ఇది నాయి బ్రాహ్మణుల ఆధ్యాత్మిక, సాంస్కృతిక గౌరవాన్ని పెంచుతుందని ఆయన తెలిపారు. ఇక కులవృత్తిగా నాయి బ్రాహ్మణులు సెలూన్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, 50 సంవత్సరాలు దాటిన తర్వాత చూపు మందగించడం వల్ల పని చేయలేని పరిస్థితి ఏర్పడుతుందని, అప్పుడు వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నాయని వివరించారు. అటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని నరవ పైడిరాజు కోరారు. కార్పొరేట్ సెలూన్‌లకు దీటుగా నాయి బ్రాహ్మణుల సెలూన్ షాప్‌లను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో, ప్రభుత్వం 5 లక్షల రూపాయల సబ్సిడీతో పాటు 10 లక్షల రూపాయల బ్యాంకు రుణం అందించి ఆర్థిక సహాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనివల్ల నాయి బ్రాహ్మణ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వృత్తిలో స్థిరత్వం వస్తుందని ఆయన పేర్కొన్నారు. నాయి బ్రాహ్మణుల సంక్షమం కోసం చేసిన ఈ వినతులను మంత్రి నారా లోకేష్ బాబు గారు సానుకూలంగా స్పందిస్తూ, ప్రభుత్వం తరఫున తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నరవ పైడిరాజు తెలిపారు.

# తుని వలసలో రైతులకు భూమి పాస్‌బుక్కుల పంపిణీ




**పద్మనాభం,పెన్ పవర్, జనవరి 7:**పద్మనాభం మండలంలోని తుని వలస గ్రామం లో బుధవారం 449 మంది రైతులకు భూమి పట్టా పాస్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పద్మనాభం తహ సీల్దార్ . ఆనంద్ రావు ఆధ్వర్యంలో నిర్వహిం చారు.ఈ సందర్భంగా భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు వారి భూములకు సంబంధించిన పట్టా పాస్‌బుక్కుల ను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్లు డి. శ్యా మల, ఎం. శ్రీనివాసు, రెవెన్యూ సిబ్బంది, వీఆ ర్వోలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సీపీ నాయకులు అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

టీడీపీ మండల అధ్యక్షులు పొత్తూరు కొండలరావు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జనవరి 7:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం వంచుల పంచాయతీ పరిధిలోని చామగెడ్డ గ్రామంలో సోమవారం (5వ తేదీ) నిర్వహించిన రెండు రహదారి బ్రిడ్జిల శంకుస్థాపనకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు వాక్యానించటం సరికాదని జీకే వీధి మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరు కొండలరావుఅన్నారు. వైసీపీ నాయకుల వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి,జీకే వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణితో కలిసి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.మండల ఎంపీపీ బోయిని కుమారి అభివృద్ధిని అడ్డుకోవడం విచారకరమని, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై వైసీపీ నాయకులు అనవసర ఆరోపణలు చేయడం తగదని ఆయన అన్నారు.ఎన్నో సంవత్సరాలుగా రహదారి సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్న రెండు పంచాయతీలకు కూటమి ప్రభుత్వం రహదారి బ్రిడ్జిలు మంజూరు చేయడంపై అభ్యంతరం ఎందుకని ప్రశ్నించారు.గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలు తెలిసికూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం ప్రజాప్రతినిధులకు శోభించదని పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి మూడు రోజుల ముందే ప్రెస్ నోట్ విడుదల చేసి ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులకు సమాచారం ఇచ్చామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే, సర్పంచులు, ఎంపీటీసీలు ప్రొటాకాల్ ఉన్నప్పటికీ శంకుస్థాపనకు హాజరు కాకపోవడం ఎందుకని ప్రశ్నించారు. ప్రత్యేకంగా ఏనుగు అంబారీకట్టి ఆహ్వానించాలా అంటూ వ్యాఖ్యానించారు. అభివృద్ధి కార్యక్రమాలపై లేనిపోని ఆరోపణలు చేయడం వైసీపీ నాయకులకు అలవాటైందని విమర్శించారు. పాడేరు టీడీపీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని శంకుస్థాపనకు ఆహ్వానించడం తప్పు కాదని, పార్టీ ప్రొటాకాల్ ప్రకారం ఆమెకు బాధ్యతలు అప్పగించిందని తెలిపారు.ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధులుగా శంకుస్థాపనకు హాజరుకాకుండా విమర్శలు చేయడం సరికాదని, తామూ ప్రజలే ఎన్నుకున్న ప్రతినిధులమని కొండలరావు అన్నారు.అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములుగా మారాలని, బురద జల్లే రాజకీయాలు మానుకోవాలని వైసీపీ నాయకులను ఆయన కోరారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన సర్పంచ్, పేసా సభ్యులు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి7:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయతీలో పారిశుధ్య పనులు వేగంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం పంచాయతీ పరిధిలోని బొర్రామామిడి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాలను స్థానిక సర్పంచ్ కుందేరి రామకృష్ణ, పేసా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబు కలిసి పర్యవేక్షంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. స్వచ్ఛ సంక్రాంతి, స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమాల కింద పారిశుధ్య పనులను చురుకుగా చేపడుతున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు కూడా పరిసరాల శుభ్రతపై బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కిల్లో మహేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ద

## కూటమికి భయం మొదలైంది : జీ వి వి ఎస్ కమలాకర్



**విశాఖ పెన్ పవర్ జనవరి 7**:మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చడమే కాకుండా రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చే నిధుల్లో కోత విధించడంతో ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునివ్వడం, తొలి నిరసన అనంతపురం జిల్లా, బండ్లపల్లిలో నిర్వహిస్తుండడంతో కూటమి ప్రభుత్వంలో భయం మొదలైందని, మరీ ముఖ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి వి ఎన్ మాధవ్ కి పరిస్థితి అర్థమై తమ సొంత రాష్ట్రం నుండే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు భారీ నిరసన సభలు ప్రారంభించడం కారణంగా నష్ట నివారణ చర్యలు మొదలు పెట్టారని అందుకే రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ చట్టం పై ప్రజల్లో అవగాహన యాత్రకు అంటూ బయలుదేరుతున్నారని, ఎన్ని యాత్రలు చేసిన కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న అనంతపురం నిరసన సభ తరువాత బీజేపీతో పాటు కూటమిలో ఉన్న టీడీపీ, జనసేనని కూడ ప్రజలు తిప్పి కొడతారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జీ వి వి ఎస్ కమలాకర్ అన్నారు.

## వంతడాపల్లి అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించిన వైసీపీ నేత



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, జనవరి 7:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం జర్రెల పంచాయతీ పరిధిలోని వంతడాపల్లి అంగన్వాడి కేంద్రాన్ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు రీమేల బాలకృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలో అందుతున్న సేవలు, పిల్లలకు అందజేస్తున్న పోషకాహారం, హాజరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు.కేంద్రంలో మౌలిక సదుపాయాలపై అంగన్వాడి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన సూచించారు.

## బొర్రామామిడి గ్రామంలో 2026 పెన్ పవర్ క్యాలెండర్ ఆవిష్కరణ



**గూడెం కొత్తవీధి, పెన్ పవర్, జనవరి 7**:అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దామనాపల్లి పంచాయితీ పరిధిలోని బొర్రామామిడి గ్రామంలో పెన్ పవర్ పత్రిక 2026 క్యాలెండర్ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోశాధికారి, దామనాపల్లి సర్పంచ్ కుందేరి రామకృష్ణ పాల్గొన్నారు. ఆవిష్కరణ తర్వాత ఆయన మాట్లాడుతూ, పెన్ పవర్ పత్రిక ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలికితీస్తూ సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నదని, ఈ పత్రికకు ప్రజాదరణ ఉన్నదని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరింత గొప్ప ప్రజాదరణ పొందాలని కూడా ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహేష్, అప్పారావు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీలు

**బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల లక్ష్యం**

**అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**



**అనకాపల్లి, పెన్ పవర్, జనవరి 7 :** బాధితులకు వేగంగా న్యాయం అందించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పష్టం చేశారు. బుధవారం ఆయన నర్సీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీస్ వ్యవస్థ పనితీరును సమగ్రంగా సమీక్షంచారు.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, కేసు రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల నిర్వహణ తీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఫిర్యాదుదారులు స్టేషన్కు వచ్చినప్పుడు వారితో మర్యాదపూర్వకంగా, సానుకూలంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు.

ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, పేదలు మరియు బలహీన వర్గాల సమస్యలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కారం చూపాలని ఆదేశించారు. నేరాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ_మెరాలను నిరంతరం పర్యవేక్షంచాలని, పనిచేయని _మెరాలకు తక్షణమే మరమ్మతులు చేయించాలని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకుని నేరాల నియంత్రణలో మరింత చురుకుగా వ్యవహరించాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, నాటు సారా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పట్టణంలో విజిబుల్ పోలీసింగ్ను పెంచడం ద్వారా నేరాలను అదుపులో ఉంచవచ్చని, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని, వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సీసీటీఎన్ఎస్ వ్యవస్థలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, రౌడీషీటర్లు మరియు పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని ఆదేశించారు.

పోలీస్ సిబ్బంది క్రమశిక్షణతో, సమయపాలనతో విధులు నిర్వహించాలని, ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించే వేగం (రెస్పాన్స్ టైమ్) మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ ఇన్స్పెక్టర్ గఫూర్, ఎస్సైలు ఉమామహేశ్వరరావు, రమేష్తో పాటు ఇతర స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం నుంచి ప్రజలకు ఉపశమనం కల్పించింది:-ప్రసాదుల




**గాజువాక: పెన్ పవర్, జనవరి 07:** వైకాపా పాలనలో ట్రూ ఆఫ్ చార్జీల పేరిట ప్రజలపై భారాన్ని మోపితే అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని గాజువాక తెదేపా సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏడాదికి పది వేల కోట్ల రూపాయల వరకు ప్రజలపై భారాన్ని మోపి అడ్డగోలుగా దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లు చొరవ తీసుకుని ప్రజలపై ఉన్న 5 వేల కోట్ల భారాన్ని రద్దు చేశారని తెలిపారు. జగన్ దుర్మార్గపు చర్యలతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారని విమర్శించారు. అభివృద్ధి సంక్షేమం దిశగా వెళ్తోన్న ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి తన సోషల్ మీడియా ద్వారా జగన్ కూటమి పాలనపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తగ్గించిన ట్రూ ఆఫ్ చార్జీల వలన ప్రతి వినియోగదారుడికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం ఏర్పాటు జగన్ వలనే వచ్చిందంటూ వైకాపా భజన బృందం చేస్తున్న తప్పుడు ప్రచారంపై మండిపడ్డారు. సమావేశంలో బీసీ సెల్ అధ్యక్షుడు శివప్రసాదరావు,జ్యోతి,పుష్పలత,కణితి సన్యాసమ్మ,శ్వేత,మురళి,ఉషారాణి,హరికృష్ణ,చౌదరి,శివారెడ్డి,నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు

## మన్యంలో ఆదర్శ గ్రామంగా బియ్యాలవలస.



**గణతంత్ర దినోత్సవం రోజున ప్రత్యేక పురస్కారం అందజేయనున్నట్లు ప్రకటన**

**గుమ్మలక్ష్మీపురం జనవరి 07 పెన్ పవర్ :** ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దిన బియ్యాల వలస గ్రామ ప్రజలకు అభినందనలు తెలిపిన మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి కురుపాం ?మండలం బియ్యాలవలస గ్రామంలో బుధవారం నాడు 'బుధవారం నాడు"గ్రామ ముస్తాబ్ కార్యక్రమంలో పాల్గొన జిల్లా కలెక్టర్. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. మన్యంలో ముస్తాబైన తొలి గ్రామంగా నిలిచిందని ప్రశంసించారు,స్వతంత్ర భారత దేశంలో ఒక అద్భుతమైన గ్రామాన్ని తీర్చిదిద్దాలనే లక్ష్యన్ని,బియ్యాలవలస ప్రజలు సాకారం చేసి చూపారని కొనియాడారు. గ్రామస్తుల సమష్టి కృషి వల్ల గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందని,ఇది జిల్లా యంత్రాంగానికి మరియు ప్రజా ప్రతినిధులకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. బియ్యాలవలస గ్రామ అభివృద్ధిని గుర్తించి,రాబోయే గణతంత్ర దినోత్సవం(జనవరి 26)వేడుకల్లో పార్వతీపురంలో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో ప్రత్యేక పురస్కారాన్ని అందజేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. గ్రామంలోని పిల్లలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై క్రమశిక్షణతో,చక్కగా తయారై రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తల్లిదండ్రులకు కూడా గ్రామీణ విలువలపై అవగాహన కల్పించాలని పిల్లలకు సూచించారు. రానున్న రోజుల్లో గ్రామ అభివృద్ధికి జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయి సహాయ సహకారాలు ఉంటాయని కలెక్టర్ బియ్యాలవలస గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ గ్రామంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు మరియు గ్రామోత్సవం అత్యంత ఉత్సాహంగా సాగాయన్నారు. గ్రామాన్ని అతి సుందరంగా రంగురంగుల ముగ్గులతో అలంకరించిన మహిళలను మరియు యువతను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా. సంస్కృతి-సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా గ్రామంలోని ప్రతి గడప ముందూ రంగురంగుల ముగ్గులతో పండగ వాతావరణం నెలకొల్పిన తీరును చూసి అతిథులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులంతా ఏకమై ఉత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందనియం అన్నారు. ?అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కురుపాం శాసనసభ్యులు,ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి,ట్రైకార్ డైరెక్టర్ పువ్వల లావణ్య,సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి,సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి,పవార్ స్వప్నిల్ జగన్నాథ్,జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు,

మండల స్థాయి అధికారులు,ప్రజా ప్రతినిధులు,గ్రామ అధికారులు,పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన డిప్యూటీ ఎంపీడీవో.



**గుమ్మలక్ష్మీపురం జనవరి 07 పెన్ పవర్.**మండలంలో దుడ్డుఖల్లు పంచాయతీ.గ్రామ సచివాలయంలో ప్రభుత్వ ఆదేశాముల మేరకు జనవరి 02 నుండి 30 తేదీ వరకు జరగనున్న రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం మండలం డిప్యూటీ ఎంపీడీవో ఎల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీవో మాట్లాడుతూ. గతంలో ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వం పూర్తిగా తొలగించి ఇప్పుడు రాజముద్రతో పాటు రైతు ఫోటో మాత్రమే నూతన పట్టాదారు పాసు పుస్తకంలో ఉంటుందన్నారు. ఏ రైతు కూడా భూమి తగాదాలు వంటి సమస్యలతో ఇబ్బందులు పడకూడదనే నేపథ్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. భూ సమస్యలు వంటి సమస్యలు ఉన్నట్లయితే తక్షణమే సంబంధిత గ్రామ సచివాలయం కు తెలియజేయాలని సచివాలయాల్లో సిబ్బంది ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్య పరిష్కారమయ్యే విధంగా సేవలందిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హరికృష్ణ,మాజీ బిజెపి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షులు నిమ్మక సింహాచలం,వై సర్పంచ్ గోల తిరుపతిరావు,సచివాలయం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ప్రారంభం మరియు మెంబర్షిప్ డెవలప్మెంట్ టాక్




**కూర్మన్నపాలెం : పెన్ పవర్, జనవరి 07:**విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆటోనమస్ దువ్వాడ, విశాఖపట్నంలో ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ ప్రారంభోత్సవం మరియు మెంబర్షిప్ డెవలప్మెంట్ టాక్ కార్యక్రమం బుధవారం, జనవరి 07, 2026న విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని వీఐఐటీ లోని ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ మరియు సీఎస్ఈఉఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాల సహకారంతో నిర్వహించింది. ఇది కళాశాలలో వృత్తిపరమైన మరియు సాంకేతిక కార్యకలాపాలను మరింత బలోపేతం చేసే ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ శివ కుమార్ పేరుమాళ్, చైర్, ఐఈఈఈ విజాగ్ బే సెక్షన్ కంప్యూటర్ సొసైటీ చాప్టర్, ముఖ్య అతిథిగా హాజరై ఐఈఈఈ కంప్యూటర్ సొసైటీ స్టూడెంట్ బ్రాంచ్ చాప్టర్ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఐఈఈఈ మెంబర్షిప్ ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రపంచ స్థాయి సాంకేతిక వనరులు, పరిశోధన మరియు ప్రచురణ అవకాశాలు, అంతర్జాతీయ సదస్సులు, గ్లోబల్ ప్రొఫెషనల్ నెట్వర్కింగ్ వంటి అనేక ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు ఐఈఈఈ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ సాంకేతిక నైపుణ్యాలు మరియు నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు.

స్టూడెంట్ బ్రాంచ్ చైర్ మిస్టర్ నిఖిల్, సెక్రటరీ మిస్ త్రిలోక్య మరియు మిస్ నస్రాఫ్ మాట్లాడుతూ ప్రస్తుతం ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్లో 70 మంది క్రియాశీల సభ్యులు ఉన్నారని, విజ్ఞాన్ యాజమాన్యం నిరంతర ప్రోత్సాహంతో త్వరలో 100 మంది సభ్యులను దాటే అవకాశముందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహాన్ని చాటారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. జె. సుధాకర్, రెక్టర్ డా. వి. మధుసూదన రావు, సీఎస్ఈ విభాగాధిపతి మిస్టర్ దినేష్ రెడ్డి, సీఎస్ఈ ఏఐ విభాగాధిపతి స్వాతి, బ్రాంచ్ కౌన్సిలర్ ప్రొఫెసర్ చక్రవర్తి, ఇతర ఐఈఈఈ ప్రొఫెషనల్ సభ్యులు, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు ముఖ్య అతిథికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, విద్యార్థులకు అందించిన విలువైన మార్గనిర్దేశానికి గుర్తింపుగా ఆయనను సత్కరించారు.

## ఎలక్ట్రికల్ వెహికల్స్ షో రూమ్ ను ప్రారంభించిన పొలమరశెట్టి శ్రీనివాసరావు




**మాధవధారా, పెన్ పవర్ జనవరి 7,:** జీవీఎంసీ 51 వ వార్డు లో ఈ రోజు పంజాబ్ హెూటల్ దగ్గర నేచ్యూరీస్ ఎలక్ట్రికల్ వెహికల్స్ స్కూటర్స్ ప్రారభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగు దేశం పార్టీ నాయకులు పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ఎలక్ట్రికల్ వెహికల్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గా పొలమరశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పుడున్న పరిస్థితుల్లో వాతావరణంలో కాలుష్యం చాలా ఎక్కువైనది వెహికల్స్ వలన కర్మాగారం వలన వచ్చే ఈ కాలుష్యం వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలో కాలుష్యం నివారించడంలో ఈ ఎలక్ట్రికల్ వెహికల్స్ ముఖ్యపాత్ర పోషిస్తున్నాయి. అందువలన ప్రజలు మోటార్ వెహికల్స్ బదులు ఎలక్ట్రికల్ వెహికల్స్ వాడాలి అని ఈ విధంగా నేను తెలియజేయుచున్నాను.

# వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం




ప్రజా సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజా ప్రతినిధులు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జనవరి 07.** మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసేల సీతమ్మ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగాయి. సమావేశంలో సమస్యలపై అధికారులను ప్రజాప్రతినిధులు నిలదీశారు. వ్యవసాయ శాఖపై జరిగిన చర్చలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ప్రతి రైతు ఐడి క్రియేట్ చేసుకోవాలని, పిఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకంలో రైతులు తమ అర్హతలను బట్టి లబ్ధి పొందవచ్చు అన్నారు. దారెల ఎంపిటిసి మాట్లాడుతూ.. వరి పంటకు సరైన దిగుబడి వచ్చే విత్తనాలు పంపిణీ చేయాలని, వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేయాలని అన్నారు. సర్పంచ్ సుభాష్ మాట్లాడుతూ.. దారపల్లిలో ప్రభుత్వం అందించిన విత్తనాలు వేయగా తెగులు వచ్చాయని, నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. నాణ్యమైన విత్తనాలు పంపిణీకి కృషి చేస్తామని, వ్యవసాయ పనిముట్లు సంక్రాంతి తర్వాత ప్రభుత్వం మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ అధికారి అన్నారు. పశు వైద్య శాఖకు సంబంధించి జరిగిన చర్చల్లో పశువైద్యాధికారిని మోక్ష మాట్లాడుతూ.. వైద్యానికి సంబంధించి అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, మండల వ్యాప్తంగా 600 ఆంత్రాక్స్ డోసులు మూగజీవాలకు వేసినట్లు ఆమె తెలిపారు. పశువులకు పురుగులు పట్టినప్పుడు రైతులు డీజిల్ పెట్రోల్ వాడుతున్నారని దీనిపై పశు వైద్యులు స్పందించి మందులు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా పశువైద్యులు గ్రామాల్లో తిరగాలని వైద్యాధికారిని దృష్టికి సభ్యులు తీసుకువచ్చారు. దారపల్లిలో ఇన్సూరెన్స్ కట్టించుకుని నేటికి రెండు సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకోలేదనీ సర్పంచ్ సుభాష్ అన్నారు. ప్రభుత్వ యేతర వ్యక్తులు చేతిలో ఇన్సూరెన్స్ చేసే బాధ్యత అప్పగిస్తే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని లక్ష్మిపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ అన్నారు. మినీ గోకులానికి సంబంధించి ఇప్పటివరకు ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. దీనిపై స్పందించిన పశు వైద్యాధికారిణి వీటన్నిటిపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా కోళ్లు అధిక సంఖ్యలో చనిపోతున్నాయని ఇది టవర్ వల్ల ఇలా జరుగుతుందని ఒక అపోహ ఉందనీ, దీనిపై ప్రజలకు ఒక క్లారిటీ రావాల్సిందన్నారు. దీనిపై స్పందించిన పశు వైద్యాధికారిని చనిపోయిన కోళ్లను పోస్టుమార్టం చేసి దేనివల్ల చనిపోతున్నాయో రిపోర్టు అందిస్తామన్నారు. ఐసిడిఎస్ కు సంబంధించి సరైన సమయంలో అంగన్వాడీలకు స్టాక్ అందించాలని సిడిపిఓ దృష్టికి సభా సభ్యులు తీసుకురాగా దీనిపై సిడిపిఓ స్పందిస్తూ అన్ని రకాల సరుకులు అందించి, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఏపీఎస్ఆర్టీసీ బస్సు సర్వీసులకు సంబంధించి సభా సభ్యులు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో బస్సు టైమింగ్స్ బోర్డ్ ఏర్పాటు చేయాలని, మారుమూల ప్రాంతంలకు బస్సులు నడపాలని సంబంధిత అధికారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ.. డుడుమా బస్సును ఉదయకాల వేళ నడిపించుటకు చర్యలు తీసుకోవాలని, ఉదయం పూట డుడుమ బస్సు లేకపోవడంతో ప్రజలు, ఆ ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై స్పందించిన సంబంధిత శాఖ అధికారి బస్సు ఏర్పాటు హామీ ఇచ్చారు. ఉద్యాన శాఖకు సంబంధించి రైతులకు సబ్సిడీ ద్వారా మొక్కలు అందించుటకు కృషి చేస్తున్నట్లు, మష్రూమ్ యూనిట్, వెదురు పెంపకాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు సంబంధిత అధికారిని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సభ్యులు రైతులకు సబ్సిడీ ద్వారా అందించే విధంగా కృషి చేయాలన్నారు. సర్వసభ్య సమావేశంలో మారుమూల రంగా భయాలు పంచాయతీ జోడిగుమ్మ రహదారిపై చర్చలకు వచ్చాయి. జోడిగుమ్మ మలుపుల వద్ద గల రహదారులన్నీ పాడైనట్లు సభ ముందు మండల అభివృద్ధి అధికారి సంబంధిత అధికారికి తెలిపారు. ఇవే కాకుండా రాములు గడ్డి బంద రహదారులు మరమ్మతులు చేపట్టాలన్నారు. దీనిపై సంబంధిత ఇంజనీర్ స్పందిస్తూ.. వాటి మరమ్మతులకు కృషి చేస్తామన్నారు. సభలో విద్యాశాఖకు సంబంధించి ప్రజా ప్రతినిధులు పాఠశాలలో మిడ్ డే మీల్స్ నాణ్యతకు పెట్టడం లేదని, అధికారులు పర్యవేక్షంచలన్నారు. దీనిపై స్పందించిన సంబంధిత విద్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలైన కృషి చేస్తామన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత శాతం పెంచడానికి అన్ని ఆశ్రమ పాఠశాలలో విస్తృతంగా పర్యటిస్తున్నట్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ శాఖ సంబంధించి సభలో జరిగిన చర్చలో పిఎం జన్మన్ కింద ప్రతి గ్రామాలలో గతంలో వేసిన స్తంభాల స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీలలో లక్షల్లో కరెంట్ బిల్లులు వస్తున్నాయని, సంబంధిత అధికారులు స్పందించాలన్నారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ అధికారి రాంబాబు మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వెలుగు శాఖకు సంబంధించి సభలో జరిగిన చర్చలో ఏపిఎం మాట్లాడుతూ.. నాటుకోడి యూనిట్ లక్ష రూపాయలతో ఏర్పాటు చేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాడేరులోన పొదుపు ఎకౌంట్ లను ముంచంగిపుట్టు ఎస్బిఐ కి ట్రాన్స్ఫర్ చేయుటకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల నివేదికలను సభ ముందు ఉంచారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ1 పాటుబోయి సత్యనారాయణ, వైస్ ఎంపిపి 2 సిరగం భాగ్యవతి, మండల అభివృద్ధి అధికారి, తహసిల్దార్, పరిపాలన అధికారి, మండలంలో ఉన్న వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దక్షణ కోస్తా రైల్వేజోన్ కు సిబ్బంది బదలాయింపులో కీలక అడుగు...

- దక్షణమధ్య, దక్షణ కోస్తా జోన్ల జి.ఎమ్.ల ఉమ్మడి నిర్ణయాన్ని స్వాగతించిన సీనియర్ రైల్వే జాతీయ కార్మిక నాయకులు చలసాని గాంధీ...
- త్వరలోనే రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ వెలువడగలదని ఆశాభావం...
- జోనల్ ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవానికి రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, ముఖ్యమంత్రి
- చంద్రబాబునాయుడు లను ఆహ్వానించుకోవాలని సూచన....



**విశాఖ పెన్ పవర్ జనవరి 7:** విశాఖపట్నం కేంద్రంగా దక్షణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటు ప్రక్రియలో మరో ముందడుగు పడింది. దక్షణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న 959 మంది సిబ్బందితోపాటు, అదనపు సిబ్బందిని, ఖాళీ పోస్టులను, దక్షణ కోస్తా రైల్వే జోనల్ కార్యాలయ నిర్వహణ నిమిత్తం తక్షణం బదిలీ చేయబోతున్నారు..దక్షణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార శ్రీవాస్తవ, దక్షణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ లు ఉమ్మడిగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని సీనియర్ రైల్వే జాతీయ కార్మిక నాయకులు,దక్షణ కోస్తా రైల్వేజోన్ పోరాట సాధన సమితి వ్యవస్థాపక కన్వీనర్, డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ వాల్తేర్ డివిజన్ సభ్యులు చలసాని గాంధీ స్వాగతించారు.. దక్షణ మధ్య రైల్వే జోనల్ ప్రధాన కార్యాలయం రైల్ నిలయంలో సోమవారం ఉమ్మడి రైల్వే జనరల్ మేనేజర్ లు చేసిన నిర్ణయంపై ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్లు సిద్ధార్ధ కట్టి, ఎల్ వి ఎస్ ఎస్ పాత్రుడులు సంతకాలు చేశారు. దక్షణ కోస్తా రైల్వే జోనల్ ప్రధాన కేంద్రంలో వివిధ విభాగాలలో, కేటగిరీలలో పనిచేసేందుకు మానవవనరులను అందించడంలో ఈ సమావేశంఅబశ్రీశ్రీ కీలక భూమికపోషించిందని చలసాని గాంధీ అన్నారు... 959 మంది సిబ్బంది తోపాటు అదనపు సిబ్బందిని, ఖాళీపోస్టులను, తాత్కాలిక ప్రాతిపదికన దక్షణ మధ్య రైల్వే విజయవాడ, గుంతకల్లు, గుంటూరు డివిజన్ ల నుండి 22 మందిని దక్షణ కోస్తా రైల్వేకు బదలాయించడం పట్ల రైల్వే ఉన్నతాధికారులకు ధన్యవాదాలు తెలిపారు...దక్షణకోస్తా రైల్వేజోన్ పాలన నిర్వహణ, కార్యకలాపాలు సజావుగా సాగాలంటే నాన్-గెజిటెడ్ క్యాడర్ అవసరం ఎంతైనావుంది..ఇప్పటివరకూ కొనసాగిన అనిశ్చిత పరిస్థితుల్లో ఈ సమావేశం ఫలవంతమైన నిర్ణయం తీసుకుందని చలసాని గాంధీ అభివర్ణించారు....సరిగ్గా ఏడాది క్రితం జనవరి 8 న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖ పర్యటనలో దక్షణ కోస్తా రైల్వే జోన్ కు శంకుస్థాపన చేసిన సందర్భాన్ని ఒక ప్రకటనలో చలసానిగాంధీ ప్రస్తుతించారు....

విశాఖపట్నంలోని సిరిపురంలో ది డెక్ భవనం లో 6, 7 అంతస్తులలో దక్షణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయాన్ని కూడా త్వరితగతిన ప్రారంభించుకోవాలని దానికి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వని వైష్ణవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడులను ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు...

అదేవిధంగా రైల్వే జోన్ గెజిట్ నోటిఫికేషన్ విడుదల కోసం విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ ఎంతో చొరవ తీసుకుంటున్నారని అది కూడా వెలువడితే కొన్ని దశాబ్దాల శ్రమకు తగిన ఫలితం దక్కుతుందని చలసాని గాంధీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు....

## ఆటస్థల అభివృద్ధికి దాతల చేయూత

- కొత్తగూడెం ప్రభుత్వ పాఠశాల ప్లే జోన్‌కు ఇసుక అందించిన ఇమ్మని గంగాధరరావు



**పెన్ పవర్, ఉంగుటూరు జనవరి 07:** కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ఆట స్థల అభివృద్ధికి దాతలు సహకరిస్తుండటం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు కర్రీ వెంకటలక్ష్మ తెలిపారు.

నాచుగుంట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మని గంగాధరరావు పాఠశాల ప్లే జోన్‌లో అవసరమైన ఇసుకకు ఆర్థిక సాయం అందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు గంగాధరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడుతున్నాయని, దీనిపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది.

## సంక్రాంతికి ముస్తాబవుతున్న ఏజెన్సీ గ్రామాలు...



**అడ్డతీగల,పెన్ పవర్ ,జనవరి07:** రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖా కమీషనర్ ఆదేశాలతో,పారిశుధ్య వారోత్సవాలు సందర్భంగా, స్వచ్ఛ గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దే క్రమంలో,అడ్డతీగల మండలం లోని సినిమహాల్ కాలనీ నుండి సీతపల్లి జంక్షన్ వరకు, సీతపల్లి జంక్షన్ నుండి ఊరి పొలిమేర వేటమామిడి రోడ్డు వరకు మరియు సీతపల్లి జంక్షన్ నుండి డొక్కపాలెం రోడ్ లో గల చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వరకు రోడ్ల కి ఇరువైపుల గల చెత్తకుప్పలను తొలగించి, పారిశుధ్యం పనులను ఎంపీడీవో కుమార్ పరిశీలించారు . రానున్న సంక్రాంతి పండుగునకు అన్ని గ్రామ పంచాయతీలను,గ్రామ ముస్తాబుగా తయారు చేసి సంక్రాంతి పండుగకు ఇతర గ్రామాల్లో నివాసం ఉంటున్న వారు, వారి వారి ఊర్ల నుండి తమ సొంత ఊరు వచ్చు వారికి, ఆనంద దాయకంగా ఉండేవిధంగా అన్ని పంచాయతీలను తీర్చిదిద్దాలని పంచాయతీ సెక్రటరీలకు ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు .

## ఆరోగ్యమే మహాభాగ్యం-సర్పంచ్ శిరీష



**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 7.** మండలంలోని పెద్దగూడెంలో బుధవారం పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రమ ఆసుపత్రి వైద్య బృందంఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ప్రాంగణంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక సర్పంచ్ పైడి శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజల ఆరోగ్యంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. తీసుకొనే ఆహారం, వాతావరణం లో మార్పులు తదితర కారణాలవల్ల ప్రతి ఒక్కరు ఏదో ఒకరోగం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే వైద్యుని సంప్రదించి తగు సూచనలు, సలహాలు పొందాలన్నారు. శిబిరంలోస్త్రీల, చిన్నపిల్లల, ఎముకల విభాగాలకు చెందిన వైద్యులతో పాటు జనరల్, నేత్ర, దంత, ఈ ఎన్ టి వైద్యులు పాల్గొన్నారు. రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి వైద్యుల సలహా మేరకు రక్త, బిపి పరీక్షలతో పాటు ఈసీజీ, ఎక్స్ రే, స్కానింగ్ ఒంటి పరీక్షల సైతం సైతం ఉచితంగా చేశారు. ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ ఈ శిబిరం కొనసాగింది. శిబిరానికి వచ్చే రోగులకు త్రాగునీరు వంటి వసతులను నిర్వాహకులు కల్పించారు. శిబిరంలో వైద్యులు 150 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అనంతరం వైద్య బృందం, శిబిరం నిర్వాహకులు భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి వైద్య బృందం, సిబ్బంది, దొడ్డిగర్ల వెంకటేశ్వరరావు, చింతలపూడి భాస్కరరావు, ఇంజమూరి సుబ్బారావు, రేవుల గడ్డ భాస్కరరావు, ఎం కొండలరావు, గుమ్మడి నాగేశ్వరరావు, బొంత శ్రీరాములు, దాసరి రామారావు,పాముల తిరుపతయ్య, పైడి దొరబాబు,తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఎంపీలకు ప్రధమ చికిత్స పై శిక్షణ

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 7** గ్రామాల్లో ప్రధమంగా అందించే చికిత్స పై పీఎంపీలకు, కొంతమంది విద్యార్థులకు బుధవారం స్థానిక రెడ్ క్రాస్ భవనం లో శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ ప్రధమఅబశ్రీశ్రీచికిత్స శిక్షణ జరిగింది . ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ కామిరెడ్డి వెంకట రమణ,జిల్లా కోశాధికారి డాక్టర్ జీ మహాలక్ష్మ లు మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ అంతర్జాతీయంగా చేస్తున్న సేవలను తెలిపారు. ఎవరికైనా ఏదైనా అపాయం జరిగినప్పుడు నిపుణుల వైద్యం అందేవరకూ తాత్కాలికంగా అందించే చికిత్సే ప్రధమ చికిత్సని, ఈ శిక్షణను పొందాలని, ఎవరికైనా ప్రథమ చికిత్స చేసి కాపాడాలంటే శిక్షణ పొందిన వారి వల్లనే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు పీఎంపీ జిల్లా అధ్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు,ఎమ్ పద్మావతి, బోను రామకృష్ణ, జె సురేష్



,పీఎంపీ జిల్లా కార్యదర్శి పి దేవానందం, జిల్లా కో ఆర్డినేటర్ రాంబాబు,ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ కే ధర్మారావు,పద్మ లతో పాటు సభ్యులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం పాల్గొన్న వారందరికీ సర్టిఫైట్స్ అందజేశారు

## మానసిక వికాసంనికి క్రీడలు



ప్రిన్సిపాల్ డాక్టర్ .ఎం .విజయ భారతి

**చింతపల్లి పెన్ పవర్ జనవరి 7:** -చింతపల్లి ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ లో భాగంలో చౌటపాడు, పెండ్లి మామిడి దత్తతగ్రామాలు లో ప్రాథమిక విద్యార్థులకు మానసిక వికాసంలో క్రీడలు అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత ప్రభావం చూపిస్తాయని చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయభారతి అన్నారు. బుధవారం గ్రామాలలో సామాజిక అవగాహన మరియు గ్రామస్థాయిలో ఉన్న ప్రాథమిక విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థులు ఉత్తేజితమై వారిలో ఉన్న ప్రతిభా వెలికితీయడానికి అవకాశం ఉంటుందన్నారు. పిన్న వయసు నుండి వారిని ప్రోత్సహించడంతో విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను బయట పెట్టడం జరుగుతుందన్నారు. దీంతో వారు మానసిక ఉల్లాసంతో పాటు శారీరకంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. తద్వారా చదువుపై దృష్టి సారించి మంచి స్థాయిలో రాణించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పూర్ణారావు, నాగేశ్వరరావు, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారుం

## ఆర్ డి ఓ ను మర్యాదపూర్వకంగా కలిసినా మాధవదార గ్రామస్తులు



**మాధవధారా, పెన్ పవర్ జనవరి 7,:** విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ (ఆర్ డి ఓ)సనపల సుధా సాగర్ ని ఆంధ్రప్రదేశ్ కళింగ కార్పోరేషన్ డైరెక్టర్ సనపల వరప్రసాద్, బిజెపి నాయకుడు _. వి. రమణ, ప్రముఖ న్యాయవాది సనపల నరసింహ స్వామి, యన్టీయస్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆర్డీవోరి తో మాధవదార ప్రాశస్త్యం వివరించడం జరిగింది. మీరు మాధవదార ఆలయాలను కుటుంబంతో తప్పకుండా దర్శించాల్సిందిగా ఆహ్వానించారు. అందుకు సుధాసాగర్ కూడా సమ్మతించి, దర్శనానికి తప్పకుండా కుటుంబశీ సమేతం గా వస్తానని తెలియజేశారు .

## నార్త్ ఎమ్ ఎల్ ఏ కు వినతిపత్రం అందజేసిన 51 వ వార్డు కార్పొరేటర్




**మాధవదార, పెన్ పవర్ జనవరి 7,:** జీవీఎంసీ 51వ వార్డ్ పలు అభివృద్ధి పనులకి సంబంధించిన వినతిపత్రం అందజేసిన వైయస్సార్సీపి రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు, 51వ వార్డ్ కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ఈ రోజు జీవీఎంసీ కమీషనర్ అధ్యక్షతన ఉత్తర నియోజకవర్గ శాసనసభ్యులు పెనుమత్స విష్ణు కుమార్ రాజు ఆధ్వర్యంలో జీవీఎంసీ ఓల్డ్ కౌన్సిల్ హాల్ లో ఉత్తర నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పై మరియు సమస్యలు పై చర్చించి ఉత్తర నియోజకవర్గం శాసనసభ్యులు కి మరియు జీవీఎంసీ కమిషనర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.

గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ రెనోవేషన్ చేయుటకు ,

మాధవస్వామి కళ్యాణ్ మండపం రెనోవేషన్ చేయుటకు వుడా కాలనీ, ఎస్ ఆర్ నగర్ బిటి రోడ్లు ఏర్పాటు చేయుట మరియు ఈస్ట్ పార్క్, ఎమ్ ఎన్ ఆర్ పార్క్ వి ఆర్ పి సి కల్వర్టు, సిసి డ్రైన్స ఏర్పాటు చేయుటకు మహత్ కాలనీ లో అవుట్డోర్ ఫిట్నెస్ ఎక్విప్మెంట్ అండ్ చిల్డ్రన్స్ రిక్రూట్మెంట్ ఏర్పాటు చేయుట కొరకు మరియు అప్పయ్య నగర్ విఆర్సిసి ఎస్ డబ్ల్యూ డ్రయిన్స్ ఏర్పాటు చేయుట కు ఇంకా వార్డు లో ఉన్న సమస్యలు కొరకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది.

## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో విస్తృత అవగాహన

* ఆర్ టి వో ఆర్ సురేష్




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 7:**జాతీయ రహదారి భద్రతా మాసోత్సవం ఉ2026 కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నగరంలోని లాలాచెరువు ట్రాఫిక్ జంక్షన్ వద్ద రోడ్డు భద్రత అమలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా రవాణా అధికారి ఆర్ సురేష్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించి, తమతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వాహనదారులు, సీట్‌బెల్ట్ ధరించకుండా కార్లు నడిపే డ్రైవర్లు, వాహనం నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాట్లాడేవారు, తప్పుడు రోడ్ లైన్లలో వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలను అతిక్రమించిన 30 మంది వాహనదారులపై కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. లాలాచెరువు వద్దనున్న మున్సిపల్ హై స్కూల్లో విద్యార్థినీ, విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది విద్యార్థులకు రహదారి భద్రత నియమాలు, హెల్మెట్ , సీట్‌బెల్ట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు , కుటుంబ సభ్యులకు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం అవసరం, ప్రాముఖ్యతను తెలియజేసేలా చైతన్య దూతలుగా మారాలని మార్గనిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమంలో రవాణా అధికారులు, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు సి. హెచ్. సంపత్ కుమార్, ఎం. రవికుమార్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు బి. ఉమా మహేశ్వర రావు, జి. ప్రణీత్ కుమార్, పి.వి.వి.డి. సాయి కుమార్, మున్సిపల్ హై స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పులుగుర్త పాఠశాలకు కుర్చీలు బహూకరణ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 7** : ఆర్.ఐ.వి.ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పులుగుర్తకు గ్రామానికి చెందిన పర్వతిని నాగేశ్వరరావు 12 వేల రూపాయలు విలువచేసే 25కుర్చీలు, 50 భోజన కంచాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుని_. సీతామహాలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అడిగిన వెంటనే పాఠశాల అవసరాలకు ఉపయోగపడే వస్తువులను అందజేసిన నాగేశ్వరరావును అభినందించారు. ఇటీవల నాగేశ్వరరావు కుటుంబం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాత నాగేశ్వరరావును ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టీవీ సురేంద్ర, జయశ్రీ, వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మి, దుర్గాప్రసాద్, సుధాకర్, రత్నకుమారులు పాల్గొన్నారు.

### బర్మా కాలనీలోని ఆర్ సి ఎస్ మిల్స్ పాఠశాలలో అభివృద్ధి పనులు



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జనవరి 7:**స్థానిక 9వ డివిజన్ బర్మా కాలనీలోని ఆర్ సి ఎస్ మిల్స్ నగర పాలక సంస్థ మోడల్ ప్రాథమిక పాఠశాలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సదరు పాఠశాలలో ఐ డి బి ఐ బ్యాంక్ సి ఎస్ ఆర్ నిధులు రూ .12,00,000 లక్షలతో జరుగుతున్న పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. స్థానిక నాయకులు ఆయన వెంట ఉన్నారు.

## ప్రత్యేక రైళ్లను తాడేపల్లిగూడెం లో నిలుపుచేయండిరైల్వే జి ఎం కు జెడ్ ఆర్ యు సి సి సభ్యులు రవి అగర్వాల్ విజ్ఞప్తి.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవ రి 07.**వివిధ ప్రాంతాలకు న డుపుతున్న ప్రత్యేక రైళ్ల ను తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ లో నిలుపు చెయలాలని జోనల్ రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు రవి అగర్వాల్ దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కు విజ్ఞప్తి చేశారు. ప్రముఖ వాణిజ్య, విద్యా కేంద్రమైన తాడేపల్లిగూడెం నుంచి నిత్యం వేలాదిమంది దేశంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తుంటరన్నారు. అయితే ప్రస్తుతం ఉన్న రైళ్లలో రిజర్వేషన్ లు సరిపోక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా నడుపుతున్న ప్రత్యేక రైళ్లకు తాడేపల్లిగూడెం లో హాల్ట్ ఏర్పాటుచేయాలనీ కోరారు. ఆమేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ కు లేఖ మెయిల్ చేసి ఇక్కడి ప్రయాణీకుల డిమాండ్ ను తెలియజేశారు. కాకినాడ –వికారాబాద్, వికారాబాద్ –పార్వతీపురం, సికింద్రాబాద్ –పార్వతీపురం, భువనేశ్వర్ –యశ్వంత్ పూర్, విశాఖపట్నం –బెంగళూరు, చర్లపల్లి –అనకాపల్లి, బేర్హంపూర్ –చర్లపల్లి మధ్య నడిపే అన్ని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను తాడేపల్లిగూడెం స్టేషన్ లో నిలుపుచేయాలనీ రవి అగర్వాల్ విజ్ఞప్తి చేశారు.

# డైమండ్స్ లయన్స్ షుగర్ వ్యాధి పై అవగాహన శిబిరం..

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 07.**అన్ని వయసుల వారిని పట్టి పీడిస్తున్న మహమ్మారి షుగర్ వ్యాధిపై అందరూ అవగాహన పెంచుకోవాలని పేరిచర్ల ఫౌండేషన్ చైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణం రాజు అన్నారు.
స్థానిక ఆర్ ఒ బి గ్రౌండ్స్ లో తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు మద్దుకూరి మెహర్ ప్రసాద్ సౌజన్యం తో మధుమేహ నిర్ధారణ పరీక్షలు శిబిరం ఆర్ అండ్ బి వాకర్స్ క్లబ్ అధ్యక్షులు మానేపల్లి కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగింది లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రతి నెల జరిగే డైమండ్స్ లయన్స్ ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు శిబిరం అందరూ ఉపయోగ పర్చు కోవాలి అన్నారు. మానేపల్లి కిరణ్ మాట్లాడుతూ ప్రజల లో షుగర్ వ్యాధి పై అవగాహన పెంచడానికి డైమండ్స్ లయన్స్ క్లబ్ పేరిచర్ల ఫౌండేషన్ సంస్థ లు ప్రతి నెల క్రమం తప్పకుండా అందిస్తూన్న ఈ క్యాంప్ అందరికి ఉపయోగం పడుతుంది అని శరీరకవ్యాయామం నడక యోగ పై అందరికి చైతన్య పరిస్తున్న ఈ సంస్థ లకు ధన్యవాదములు తెలిపారు ఆర్ అండ్ బి వాకర్స్ కార్యదర్శి లయన్ యర్రా ఆంజనేయ స్వామి కోశాధికారి సుబ్బారావు గుప్తా ఉపాధ్యక్షులు దంగేటి ముఖర్జీ,




గాజుల మురళీ కృష్ణ జాయంట్ సెక్రటరీ దాసరి వెంకటేశ్వర రావు, బాబురావు, జాలీ వాకర్స్ కంచర్ల లక్ష్మి, నరసింహ, గ్రంధి అపర్ణ ప్రసాద్ సభ్యులు రెడ్డి సత్యనారాయణ ఈశ్వర్ యెలిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ

చైర్మన్ బూర్లగడ్డకు అభినందనలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 7 :**ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు శ్రీ వెంకటేశ్వర జనరల్ మార్కెట్ అధ్యక్షులు నందెపు శ్రీనివాస్ ప్రతిష్టాత్మకమైన ది ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నకు 2026 నుండి 2029 సంవత్సరం వరకు మూడు సంవత్సరములకు కన్వీనర్ గా నియమితులైన శుభ సందర్భంగా, నందెపు శ్రీనివాస్ కి ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గ, కార్యవర్గ బిల్డింగ్ ట్రస్ట్ సభ్యుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో ఉన్నతమైన పదవులు చేపట్టాలని తవ్వా సూర్యనారాయణ మూర్తి (రాజా ), చాంబర్ అధ్యక్షులు. ఆకుల శ్రీనివాస్, చాంబర్ గౌరవ కార్యదర్శి. ఆకాంక్షస్తున్నామన్నారు. ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ బూర్లగడ్డ వెంకట సుబ్బారాయుడు ప్రతిష్టాత్మకమైన తూర్పుగోదావరి జిల్లా ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ చైర్మన్ గా 2026 నుండి 29 వరకు మూడు సంవత్సరములకు నియమితులైన శుభ సందర్భముగా, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ పాలకవర్గ కార్యవర్గ బిల్డింగ్



ట్రస్ట్ సభ్యుల తరపున శుభాకాంక్షలు తెలిపారు.

## యువత ఉన్నత రాజకీయ లక్ష్యాలతో పనిచేయాలి.

ఎమ్మెల్యే బొలిశెట్టి.



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 07.**
యువత రాజకీయాలలో ఉన్నత లక్ష్యాలతో పనిచేయాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.
భారతీయ జనతా పార్టీ జిల్లా యువ మోర్చా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన సందర్భంగా పత్స గోపాలకృష్ణ శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువకులు రాజకీయాల్లో రాణించాలని, ప్రజలకు సేవ చేయడంలో ముందుండాలని, పార్టీలకు అతీతంగా పనిచేసే మంచి పేరు మరిన్ని పదవులు అధిరోహించాలని, ఆ పదవికి వన్నె తెచ్చే విధంగా ఉండాలని అన్నారు. తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు దువ్వ శ్రీనివాస్, కమిశెట్టి శ్రీను, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దుట్ట యువరామ్,
ఆచంట శ్రీను,మానూరి సత్యనారాయణ మూర్తి,
ఎల్లా ప్రవీణ్, మంగుటూర్తి మెహర్ తదితరులు పాల్గొన్నారు.

### ఇతర రాష్ట్రాలకు చెందిన- డ్యూటీ చెల్లించని మద్యం తరలించడం అమ్మడం నేరం



* ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఈ స్వరాజ్యలక్ష్మి.

**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 07.**సంక్రాంతి పండుగ వేళ జిల్లాకు విచ్చేసే ఇతర రాష్ట్రాలకు దేశాలకు చెందిన వ్యక్తులు తమతో పాటు మద్యం బాటిల్ను తరలించే అవకాశం ఉందని ఇతర రాష్ట్రాలకు చెందిన మన రాష్ట్రానికి పన్ను చెల్లించని మద్యం సరఫరా చేయడం అమ్మటం చేస్తే వారి పై కేసులు నమోదు చేస్తామని, అలాగే మద్యం తో పట్టు బడే వాహనాలను కూడా సీజ్ చేస్తామని ఆమె తెలియ జేశారు. స్థానిక రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ అలాగే పార్సిల్ ఆఫీస్ లను ఆమె తన సిబ్బంది తో కలసి తనిఖీలు నిర్వహించారు. ఆటో డ్రైవర్ లు రవాణా వాహన యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు అనుమానిత వస్తువుల వివరాలను తమకు తెలియ జేయాలని తెలియ జేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆమె అన్నారు.

# హైవే పనుల వల్ల త్రాగు నీరు వృధా

**జీలుగుమిల్లి, పెన్ పవర్, జనవరి 7;** జాతీయ రహదారి పనులలో భాగంగా డ్రైనేజీ కారణంగా త్రాగునీటి పైపులైన్ పగిలిందని మండల బిజెపి అధ్యక్షులు గుడ్ల రాంబాబు వాపోయారు. బుధవారం తాటి యాకులగూడెం పైప్లైన్ పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైప్లైన్ పగలడంతో త్రాగునీరు పూర్తిగా వృధా అవుతుందని అన్నారు. దీనిపై పంచాయతీ అధికారులకు చెప్పిన ఫలితం లేదని అన్నారు. త్రాగునీరు సరఫరాకు అంతరాయం కలుగుతుందని అన్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే



స్పందించి పైప్ లైన్ కు మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు.

### భారత ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నతుడు స్వామి వివేకానంద.




**ఏలేశ్వరం, పెన్ పవర్, జనవరి 7:** భారత దేశ ఆధ్యాత్మిక గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో, ఏలేశ్వరం ఆర్ట్స్ క్లబ్ , యర్రవరం వివేకానంద సమితి ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు . కళాశాల ప్రిన్సిపల్ డా. డి . సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా వివేకా నంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు . ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాట్లాడుతూ రామకృష్ణ పరమహంసకి అత్యంత ప్రియ శిష్యుడిగా వేదాంత తత్వాన్ని ఆధునిక శైలిలో వివరిస్తూ, ఆధ్యాత్మికతను సామాజిక సేవతో మిళితం చేశారని అన్నారు. 1893లో అమెరికాలోని చికాగోలో జరిగిన ప్రపంచ మతసమ్మేళనంలో "సోదర సోదరీమణులారా" అంటూ ప్రారంభమైన ఆయన ప్రసంగం ప్రపంచాన్ని ఆకట్టుకొని భారత సంస్కృతి, సహన భావం, సర్వమత సమభావాన్ని అంతర్జాతీయ వేదికపై ప్రతిష్ఠించిందని అన్నారు. యువతను శక్తివంతం చేసే సందేశాలతో "లేచిరండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరేవరకు ఆగవద్దు" అనే నినాదంతో జాతీయ చైతన్యాన్ని రగిలించిన మేధావి స్వామి వివేకానంద అన్నారు. 1897లో రామకృష్ణ మిషన్‌ను స్థాపించి, విద్య, ఆరోగ్యం, పేదల సేవ వంటి కార్యక్రమాల ద్వారా మానవ సేవే మాధవ సేవ అనే సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టారని, యువతను దేశ భవిష్యత్తుగా భావించి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్వదేశాభిమానం కలిగిన వ్యక్తిత్వ నిర్మాణానికి పిలుపునిచ్చారని, స్వామి వివేకానంద ఆలోచనలు నేటికీ భారత యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు . యువకులైన విద్యార్దులు స్వామి వివేకా నంద ను ఆదర్శంగా తీసుకొని జ్ఞాన సముపార్జన చేయాలని కోరారు. ఈ కార్యక్రమమలో వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు ఎం. నాగేశ్వర రావు , రాజు , వినయ్ , కళాశాల వైస్ ప్రిన్సిపల్_. వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ, ఆర్ట్స్ క్లబ్ సభ్యులు డా. శివప్రసాద్, వీర భద్ర రావు, మేరి రొసిలిన అధ్యాపకులు వి రామ రావు , సురేశ్ , శ్రీ లక్ష్మి, పుష్పా, రాజేశ్ , సతీశ్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### తెలుగు భాషాసేవలో మరింత బాధ్యత పెంచిన తెలుగు భాషా పురస్కారం

* ప్రపంచ మహాసభల్లో పురస్కార గ్రహీత
* కొల్లి రమావతి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, జనవరి 07.**గజల్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన వేదికమీద
అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని కొల్లి రమావతి అన్నారు. తెలుగు భాషాసేవకు గుర్తింపుగా 'ఆంధ్ర సారస్వత సేవా పురస్కారం' ను త్రిపుర గవర్నర్ ఎన్. ఇంద్రసేనారెడ్డి చేతులమీదుగా ఆమె స్వీకరించడం విదితమే. విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలైన రమావతి అమరావతిలో నందమూరి తారక రామారావు వేదికపై వివిధ రంగాల ప్రముఖులు మాడుగుల నాగఫణిశర్మ, నన్నపనేని రాజకుమారి సమక్షంలో భాషాసేవ అవార్డును అందుకున్నారు. ఇదే స్ఫూర్తి తో తెలుగునాట రెండు రాష్ట్రాల్లోనూ తమ సంస్థ తరపున మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మహాసభల సందర్భంలో, అన్ని తెలుగు సంఘాల ముఖ్య సమన్వయకర్తగా ఆమె కీలక బాధ్యత వహించారు.

# కాజులూరులో టీడీపీఉజనసేన నాయకుల సమావేశం

**కాజులూరు, పెన్ పవర్, జనవరి 7:**కాజులూరు మండలంలో టీడీపీఉజనసేన నాయకుల సమావేశం నిర్వహించగా, ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మండలంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణ,ప్రజా సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాజులూరు మండలం టీడీపీ ప్రెసిడెంట్ చవ్వాకుల నారాయణమూర్తి (డాక్టర్ బాబు), ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషారావు, మండల బీసీ సెల్ అధ్యక్షులు గుబ్బల నాగేంద్ర కుమార్,గ్రామ కమిటీ ప్రెసిడెంట్ పెంకే విష్ణుమూర్తి, కార్యదర్శి పాలిక సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అలాగే జనసేన నాయకులు గంజా మోహన్ బాబు, వాసంశెట్టి చినబాబు,గంజా బుజ్జి కుమార్,ఇందుర్తి బుజ్జి,వీర అబ్బా సుశన్,నిషార్,దాదు,వాసంశెట్టి సత్యనారాయణ,వీఆర్వో_.వరలక్ష్మి, అంగరకృష్ణ,తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com